ప్రజాశక్తి
సోపతి
నవంబర్ 30, 2014 ఆదివారం అనుబంధం

చికిత్స లేదు, చైతన్యమే రక్ష

- అంతర్లోకాల ఆవిష్కరణే ఆమె కవిత్వం
- జనం కోసం జానపదం - యక్షగానం
- విల్సన్‌రావు, కె క్యూబ్‌వర్మ కవితలు
- ఘంటసాల గానామృతం

ఆమె జీవితం ఒక గొప్ప పాఠం



తెలుగు చలనచిత్రసీమలో ఆణిముత్యాలనదగిన సినిమాలు 'దేవదాసు', 'మాయాబజార్'. పద్దెనిమిదేళ్ళ వయసులో 'దేవదాసు'లోనూ, 21 ఏళ్ళ వయసులో 'మాయాబజార్'లోనూ నటించిన సావిత్రి వెండితెరకు వెలుగునిచ్చిన మహానటి. జీవితంలో చీకటివెలుగులు చూసిన మనీషి. అద్భుతమైన పాత్రలకు జీవం పోసి, నటనలో నవరసాలు పోషించిన సావిత్రి జీవితం ఒక గొప్ప పాఠం. నిండా యాభై ఏళ్ళు కూడా బతకని సావిత్రి (6 డిసెంబర్ 1936–26 డిసెంబర్ 1981) అచిరకాలం గుర్తుండిపోయే పాత్రల్లో నటించి జీవించారు. సినిమా రంగంలో ప్రవేశించి రాణించాలనుకునేవారికి ఆమె నటనా జీవితం, వ్యక్తిగత జీవితమూ రెండు చక్కని పాఠాలు.

అందంలోనూ, అభినయంలోనూ ఆమెకు ఆమే సాటి. ఈనాటివరకు తెలుగు చలనచిత్ర చరిత్రలో ఆమెకు సాటి రాగల నటి మరొకరు రాలేదు. ఆమె ప్రత్యేకత, విలక్షణత అలాగే నిలిచిపోయాయి. హావభావాల ప్రదర్శనలో ఆమెను మించిన వారు లేరు. చాలా సహజాతి సహజంగా పాత్రల్లో ఇమిడిపోయి నటించడం కాదు జీవించారు సావిత్రి. ఒక నటికి ఉండాల్సిన మహత్తర లక్షణాలు ఆమెలో వున్నాయి. సావిత్రి గురించి మరోసారి అవలోకిస్తే తమిళంలో జయకాంతన్ రాసిన నవల 'కళ్యాణి' గుర్తుకొచ్చింది. జిల్లెళ్ళ బాలాజీ తమిళం నుంచి తెలుగులోకి అనువాదం చేసిన నవల ఇది. నిండైన ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ప్రదర్శించే తత్వం కళ్యాణిలో వుంది. కరుణ, ప్రేమ, అనురాగం చూపడంలోనూ కళ్యాణిది ప్రత్యేక తరహా. ప్రేమతో జీవితం మలుపు తిరుగుతుందనుకుంటే ఒడిదుడుకులకు, ఒత్తిళ్ళకు లోనవుతుంది. ఆ తర్వాత తీవ్ర అనారోగ్యం పాలవుతుంది. కానీ ఆత్మస్థైర్యం వీడదు కళ్యాణి. జీవితపు చరమాంకంలోనూ ఆత్మాభిమానం కనబరుస్తుంది. అయితే నవల ముగింపులో కళ్యాణికి సాంత్వన లభించింది. తిరిగి వచ్చిన సహచరుడి ప్రేమ ఆలంబనవుతుంది.

కళ్యాణి కల్పిత పాత్ర. రచయిత ఆమె జీవితంలోకి మరల ప్రేమ రాకడని సృజించారు. సావిత్రి నిజ జీవిత పాత్ర. కాలం ఆమె చేతిలో లేదు. అందుకే ఇక్కడ సావిత్రి ముగింపు విషాదాంతం. దు:ఖభరితం. వేదనామయం. 'గోరింటాకు' (1979) చిత్రంలో సావిత్రిని చూస్తే, అలనాటి మహానటి ఈమేనా అని విస్మయం చెందుతాం. కాలానిది ఎంతటి నిర్దయ అనిపిస్తుంది. 1950లలో ఒక వెలుగు వెలిగిన సావిత్రి అంశ మచ్చుకైనా లేని ఒక బలహీనమైన పాత్రలో కనిపించిందా సినిమాలో. అనేక పాత్రల్లో తనకు తానే పోటీగా నటించిన సావిత్రిలో ఆత్మాభిమానం మెండు. 'దేవత' చిత్రంలో తొలి భాగంలో అనురాగమయి అయిన భార్య, తల్లి పాత్రలో, విశ్రాంతి తర్వాత కోపావేశాలు, ఆత్మగౌరవం కలిగిన యువతి పాత్రలో భావోద్వేగాల్ని కనబరిచే సావిత్రిని గమనిస్తే ఆమెలోని నటనా వైదుష్యం ఏమిటో తెలుస్తుంది.

బహుశా ప్రేమ రాహిత్యమే ఆమెని కబళించి వుంటుంది. నటిగా ఆమె గొప్పతనం గురించి ఎందరో ఎన్నో చెప్పారు. ఆమె నట జీవితం గురించి చాలామంది రాశారు. కానీ తెలుగు జాతి గర్వించదగ్గ నటిగా ప్రసిద్ధి చెందిన సావిత్రి జీవితం ఎందుకంత విషాదాంతమైందన్నది శేషప్రశ్న. పైపై పరిశీలనలు, వ్యాఖ్యానాలు చాలవు. ఆమె జీవితాన్ని గురించి సాధికారికమైన, సమగ్రమైన, నిశితమైన, విశ్లేషణాత్మకమైన పుస్తకాలు తెలుగులో రాలేదు. ఇటీవల జీవితచరిత్రల్ని సినిమాలుగా తీసే ధోరణి హాలీవుడ్, బాలీవుడ్‌లలో చూస్తున్నాం. సావిత్రి జీవితాన్ని సినిమాగా తీస్తే... ఎలా వుంటుంది? సినిమా రంగం వాళ్ళే ఆలోచించాలి. సావిత్రి పాత్రని సావిత్రి మాదిరిగా పోషించే వాళ్ళు ఎవరనే ప్రశ్న రావచ్చు. కనీసం ఈరకమైన ఆలోచనలు చేసి, ఆ ప్రయత్నం మొదలుపెట్టాలి కదా...!

వయసు, అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం ఉన్నప్పుడు చూపే అభిమానాలు, కురిపించే ప్రశంసలకేం కొదవ! కానీ కలిసి వచ్చే కాలం కాస్త అటుఇటయితే పలకరించే స్వరం ఒకటి ఉండాలి. ఒక చేయి ఆసరా అవ్వాలి. 'నేనున్నా'నని పలికే మనిషి ఒకరు ఉండాలి. మనసున మనసై నిలవకున్నా, మనిషయి, నలుగురిలో తిరుగాడే శక్తి వచ్చేవరకు బాసటగా నిలిచే మనిషి కావాలి. బహుశా అలాంటి మనిషి తోడు లేకపోవడమే ఆమె అకాల నిష్క్రమణకు కారణమా? ఏమో...!, ఏమయినా కావచ్చు... ఎన్నెన్నో కారణాలుండొచ్చు. అయినప్పటికీ తెలుగు సినిమా చరిత్రకే అలంకారం సావిత్రి. ఆ మహానటి ఉజ్వలమైన దశ, చరమ దశల గురించి ఇప్పటికయినా ఎవరయినా శోధించి రాస్తే మంచి పుస్తకమవుతుంది. ఇతరులకు చక్కని పాఠమవుతుంది.

■ అంతరంగం

ప్రతిభ

సంక్షుభితమైన సమాజంలో ప్రతిభను అంచనా వేయడానికి, ప్రతిభను పెంచుకోడానికి సమాన అవకాశాలు ఉండవు. అవకాశాల కల్పనలో వివక్ష కూడా ప్రతిభను నిర్ణయిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, ధనికులు పేదలు, అగ్రకులాలు, బడుగువర్గాలు నడుమ వైరుధ్యాలున్నాయి. అందుకని ప్రతిభని తూచే కొలమానాలు కూడా భిన్నంగా వుండాలి. పుట్టుకతోనే ఎవరూ ప్రతిభావంతులు కారు. శైశవదశ నుంచి ఎదిగివచ్చే క్రమంలో సామాజిక జీవనంలో సమాన అవకాశాలు ఉండాలి. ఆసక్తులు, అభిరుచులు ప్రోది చేయడంలోనూ వర్గం, కులం, ప్రాంతం కీలకపాత్ర వహిస్తాయి. వీటిని అర్థం చేసుకుంటూ ఆయా వ్యక్తుల్లోని ప్రతిభను గుర్తించాలి. అనేక ఒడిదుడుకులు, ఇక్కట్ల నడుమ సైతం రాణించేందుకు సలిపే తీవ్రకృషితో కొందరు ప్రతిభావంతులవుతారు. మేధావులుగా రూపొందుతారు. కఠోర పరిశ్రమ, క్రమశిక్షణ ఇందుకు తోడవుతాయి. ఇదే సమయాన మనుషుల్లో ప్రతిభను గుర్తించి, వారికి ఇష్టమైన రంగంలో ముందుకు వెళ్ళడానికి ప్రోత్సహించాలి.

దీనికి భిన్నంగా చాలామంది తమ పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని కోరుకుంటారు. అసలు వారి ఆసక్తి ఎందులో వున్నదో గమనించడానికి ప్రయత్నించరు. ఒకవేళ పిల్లల ఆసక్తులు తెలిసినప్పటికీ తాము అనుకున్న నమూనాలోకి పిల్లల్ని కుదించే ప్రయత్నం చేస్తారు. ఇలాంటప్పుడు ప్రతిభ వికసించి వృద్ధి చెందడానికి అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకొని సుప్రసిద్ధ విద్యావేత్త ఇలా అన్నారు: "మనం ఏ ఒక్కరి ప్రతిభని అణచివెయ్యకూడదు. ఒక మనిషికి అత్యధిక శక్తి సామర్థ్యాలు ఎందులో వుంటాయో పరిశీలించి తెలుసుకొని వాటిని ప్రోత్సహించాలి. ఒకరికి గణితశాస్త్రంలో సామర్థ్యం వుంటే లాటిన్ భాషని బట్టీ పట్టమనడంలో అర్థం ఏముంది? సజీవమైన ఊహాశక్తి గలవాడిని నిరుత్సాహకర బీజగణితంలో కుస్తీ పట్టమనడం దేనికి?" ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఆలోచన చేయగలిగితే ప్రతిభకీ, విద్యకీ మధ్యన ఉండే సంబంధం బోధపడుతుంది. ఎవరికి ఇష్టమైన రంగంలో వారు నిమగ్నమై చదవడానికి అనువైన వాతావరణం కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత, ప్రభుత్వం బాధ్యత.

ఈ దిశలో ఆలోచిస్తే ప్రతిభను గుర్తించడానికి, సాన బెట్టడానికి వీలవుతుంది. దీనితోపాటు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలన్న తపన మనుషుల్లో ప్రోది చేయాలి. ఇది ప్రతిభను పెంచుకోడానికి ఉపకరిస్తుంది. ఇష్టమైన రంగంలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించడం కుదురుతుంది. అంతిమంగా మనిషి ప్రతిభ సమాజానికి ఉపయోగపడాలన్న ఆకాంక్ష కూడా ఉండాలి. వ్యక్తుల ఎదుగుదల ఒక్కటే కాదు సమాజ పురోగమనం కూడా ప్రతిభలో ఇమిడి వున్న అంశం. అందుకని ప్రతిభకు పదును పెట్టుకోగల సదవకాశాలు సమాజంలో సకల వర్గాలకు అందించాలి. ఇక్కడ ఎలాంటి వివక్ష కూడదు. అప్పుడే వ్యక్తి వికాసానికి మాత్రమే కాదు సమాజ వికాసానికి సైతం ప్రతిభాశక్తి ఉపకరిస్తుంది.

వెంటాడే వాక్యం

ధర్మాత్ముడయిన మనిషి మంచి గంధపు చెట్టు లాంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన ఇస్తుంది. - తులసీదాస్

ప్రజాశక్తి సోపతి

నవంబర్ 30, 2014

లేఖలు 4

స్మరణ వెలుగుజాడ గురజాడ 5

కవర్‌స్టోరీ

చికిత్స లేదు, చైతన్యమే రక్ష 6

సంగీతం ఘంటసాల గానామృతం 9

కథ

బంగారు పక్షి 10

సృజన జనంకోసం జానపదం - యక్షగానం 13

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

సౌందర్యం 18

ఎరుక అహంకార ప్రదర్శనకి అనేక రూపాలు 19

అంతర్లోకాల ఆవిష్కరణే ఆమె కవిత్వం 20

సోర్స్‌కోడ్ ఆ సైట్లను ఆపడమెలా? 22

హెపిటైటిస్ బి కి చెక్ పెట్టవచ్చు 23

సమీక్షలు

స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు 24

ఈ వారం కవిత్వం

గురిచూసే పద్యం కోసం 26



డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినం. మందుల్లేని వ్యాధి ఇది. దాని నివారణకు అవగాహనే ఉత్తమం. ఇదెలా సాధ్యమో వివరించే ముఖచిత్ర కథనమిది.

లేఖలు



కవర్‌స్టోరీ చాలా బాగుంది

ఈకాలం పిల్లలు టీవీలు లేనిదే ఏపని చేయడం లేదు. తినడం, ఆడుకోవడం అన్ని టీవీ ముందే. దీనివల్ల ఏం తింటున్నారో, ఎలా తింటున్నారో కూడా గమనించకుండా తినేస్తున్నారు. పెట్టింది తినేస్తున్నారు కదాని అదే అలవాటు చేస్తున్నారు తల్లిదండ్రులు. ఇలా పిల్లలు శ్రద్ధతో ఏకాగ్రతతో భోజనం చేయకపోవడం వల్ల ఒంటికి పట్టదని పెద్దలు అంటుంటారు. ఇలా ఆరోగ్యానికి హానికరంగా మారుతుంది. ఇలాంటి నష్టాలే కాదు సమాచార లభ్యత లాంటి లాభాలు కూడా ఉన్నాయి. అందుకే టివిని సద్వినియోగం చేసుకోవాలే కాని దుర్వినియోగం చేయకూడదు. టివిని చూడటం వల్ల కలిగే లాభనష్టాల గురించి ఎన్నో విషయాలు తెలియజేసిన సోపతికి ధన్యవాదాలు.

– చింటు, కొణిజర్ల

సబబు కాదు

16.11.14వ తేది సోపతిలో వచ్చిన 'సాధికారిక జీవన పయనం' వ్యాసంలో జీవాత్మ, పరమాత్మ, గీతసారం, కర్మలు, జీవాత్మ పరమాత్మతో కలిసిపోతుంది. లాంటి వ్యాఖ్యలు, పదాలు ప్రజాశక్తిలో ఎప్పటి నుండి ఇస్తున్నారు. ప్రజశక్తి పేపర్‌కి ఒక ఇమేజ్ ఉంది. మూఢనమ్మకాలకు ప్రజాశక్తి చాలా దూరంగా ఉంటుంది, ఎలాంటి మూఢవిశ్వాసాలనూ ప్రజాశక్తి ప్రోత్సహించదు ఈ ఇమేజ్ ఉన్న పేపర్‌లో ఇలాంటి పదాలు, వ్యాసాలు రావడం సబాబుకాదు.

– గోపి మురళీ కృష్ణ, హైదరాబాద్

యాతం కాదు

సోపతిలో 'జానపదాల జలధి జాలాది' వ్యాసంలో 'నేటీకీ ఎడతెగక పారు నది యాతమేసి తోడినా' పాట ఇచ్చారు. ఫొటోలో వచ్చింది యాతం కాదు. యాతం వేరుగా ఉంటుంది.

– మూర్తి, హైదరాబాద్

నవలలే పిల్లలుగా...

అమెరికాలో పుట్టి చైనాలో పెరిగి రచయితగా మారిన పెర్ల్ నవలలనే పిల్లలుగా భావించి ఎన్నో రచనలు చేసింది. తల్లిదండ్రుల జీవితచరిత్రలను కూడా రాసి వారికి ఈ విధంగా నివాళి అర్పించడం ఎంతో స్ఫూర్తిదాయకం. వివిధ దేశాల రాజకీయ, ఆర్థిక, సామాజిక, వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేస్తూ వాటిపై రచనలు చేయడం ప్రత్యేకత. **– అంకిత, హైదరాబాద్**

జీవితానుభవమే ప్రేమ

జీవితానుభావాల పారమే ప్రేమ అంటూ వివరించిన నవరాగం బాగుంది. **– సరళ, ఖమ్మం**

కలకాలం నిలిచే పాటలు

బి.ఎన్.రెడ్డి సినిమాలలో పాటలలో సాహిత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అలాంటి ఎన్నో పాటల గురించి చక్కగా వివరించారు. **– రజిని, మేడ్చల్**

ఆచరణే ప్రధానం

ఇతరులకు ఎప్పుడూ క్లాసు తీసుకునే పనిలోనే ఉంటాడు కొందరు. కాని ఆచరణలోకి వచ్చేసరికి మాత్రం అవి వారు పాటించరు. ఇలాంటి వారందరూ నిత్యజీవితంలో ఎందరో ఎదురవుతూనే ఉంటారు. అందుకే ఆదర్శాలను వల్లించడమే కాదు ఆచరించడం కూడా ముఖ్యమే.

– ప్రసాద్, మెదక్

పేదల భోజనం ఎంతో రుచి

స్వీడన్ అనువాద కథ "ఉప్పు–రొట్టె" ఎంతో బాగుంది. రొట్టె, ఉప్పులకు పేద, ధనిక అనే తేడా లేదు. ఎందుకంటే ఇది ఎలాంటివారికైనా అవసరమే.

– మహేష్, వనపర్తి

మన జాతీయాలు

కడిగిన లింగం తీరు

విగ్రహానికి, లింగానికి తేడా వుంది. లింగం పోత పోసినట్లుగా ఏ వంకలు లేకుండా వుంటుంది. లింగం కడగగానే కొట్టవచ్చినట్లు కనబడుతుంది. శుభ్రంగా, ఏ పాపమంటకుండా, పరిశుద్ధంగా ఉందనటానికి ఈ జాతీయం వాడతారు. "నీవు పోలీసు ఠాణాలకు రమ్మన్న ఇంకా ఎక్కడికి రమ్మన్నా వస్తా. కడిగిన లింగం తీరు నా దగ్గరే తప్పులేదు. పాపం లేకుంటే భయం లేదు పద" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

ఆనుగంటి జమ-పానుగంటి ఖర్చు

ఆనగల్లు పానగల్లు ఒకే రాజావారి సంస్థానాలు. ఆంధ్రదేశంలో యిప్పటికి ఈ పేర్లతో గ్రామాలున్నాయి. ఆనుగంటిలో శిస్తు వసూలు ఆదాయం పానుగంటిలో రాజావారి ఖర్చులకు సరి. ఆదాయం చూసి సంతోషిద్దామనుకుంటే వ్యయం కూడా అంతే ఉండేది. రాజావారి ఆదాయ వ్యయాలను చూసి ప్రజలు ఎంత చెట్టుకు అంత గాలి అనుకునేవారు. "మనవాడి ఉద్యోగం పెద్దదే. ఖర్చు కూడా అదే మోతాదు. ఆనుగంటి జమ పానుగంటి ఖర్చు" అన్నాడట ఒక తండ్రి.

ఏనుగు మేత

ఏ జంతువు అయినా తను తినే దాని కన్న ఎక్కువే మేస్తుందట. ఏనుగు బరువు ఎంత మోస్తుందో, పని ఎంత చేస్తుందో మేత కూడా అలానే మేస్తుంది. ఏనుగు మేసినా ఒక మునుము మేస్తుంది. చేసినా పెద్ద బరువయిన పనులే చేస్తుంది. చూడటానికి సన్నగా రివటలా వున్నవారు కూడా కొందరు ఎక్కువగా తింటారు. మేకచూపులు, ఏనుగు మేపులు అంటారు. ఏనుగుకు ఏనుగంత మేత పెట్టవల్సిందే.

– వేముల పెరుమాళ్ళు

■ స్మరణ

వెలుగుజాడ గురజాడ



కొందరు ఈ లోకం నుంచి వెళ్ళిపోయినా లోకం వున్నంతవరకు వారి అడుగుజాడలు చెదిరిపోవు. ఆ అడుగుజాడల వెలుగు కాలంతోపాటు ప్రతి తరాన్ని ఉద్దీపింపజేస్తుంది. కొత్తబాటల్లో ప్రయాణించడానికి ప్రేరణ అవుతుంది. అలాంటి వెలుగుజాడ గురజాడ. యాభై ఏళ్ళు నిండక ముందే ఈ లోకం నుంచి నిష్క్రమించారు గురజాడ (21 సెప్టెంబర్ 1862- 30 నవంబర్ 1815). వారి శత వర్ధంతి సంవత్సరమిది. కొన్నాళ్ళ కిందట వారి నూటాయాభయ్యవ జయంత్యుత్సవాలు జరిగాయి. చనిపోయిన మనిషిని వందేళ్ళ తర్వాత కూడా గుర్తు పెట్టుకోవడమంటే అది ఆ మనిషి 'మరణానంతర జీవితం'. నిజానికి మరణం తర్వాతే ఎక్కువకాలం జీవించారు గురజాడ. మరణం తర్వాత కూడా జీవించడమంటే మాయలు, మర్మాలు కాదు. బతికివున్న కాలంలో లోకం కోసం, సాటి మనుషుల కోసం అందించిన తోడ్పాటు మాత్రమే వారికి బతుకు నిస్తుంది. ఆ బతుకే మరణానంతర జీవితం. ఇది గురజాడ విషయంలో ముమ్మాటికీ నిజం.

ఆయన సృజించిన గిరీశం పాత్రను ఎన్నో రూపాల్లో ఇవాళ సమాజంలో చూస్తున్నాం. దాదాపు 110 ఏళ్ళ కిందటనే గిరీశాల గురించి హెచ్చరించారు గురజాడ. కానీ సకల రంగాల్లో గిరీశాలదే రాజ్యం కావడం ఇవాళ మనం చూస్తున్న చేదునిజం.

ఈనాటికీ గురజాడ 'కన్యాశుల్కం' నాటకానికి ప్రాసంగికత వుంది. వారి 'పుత్తడిబొమ్మ' గురించి పిల్లలు చదువుకుంటున్నారు. "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అని వారు చెప్పిన మాటని పదే పదే గుర్తు చేసుకుంటున్నారు. కోటబుల్ కోట్స్ వంటి వారి మాటల్ని ఉటంకించకుండా తెలుగు జర్నలిజానికి రోజు గడవదు. వారి సృజనాత్మక జీవితం తెలుగువారిని ఇంకా ప్రభావితం చేస్తూనే వుంది. కాలం కంటే ముందున్న గురజాడ సృజించిన పాత్రలు మానవ మనస్తత్వాన్ని, మనుషుల సరళిని తెలియజేస్తాయి. ఆయన సృజించిన గిరీశం పాత్రను ఎన్నో రూపాల్లో ఇవాళ సమాజంలో చూస్తున్నాం. దాదాపు 110 ఏళ్ళ కిందటనే గిరీశాల గురించి హెచ్చరించారు గురజాడ. కానీ సకల రంగాల్లో గిరీశాలదే రాజ్యం కావడం ఇవాళ మనం చూస్తున్న చేదునిజం. దీన్నిబట్టి మానవ స్వభావాన్ని అంచనా వేయడంలో గురజాడ దూరదృష్టిని అర్థం చేసుకోవచ్చు.

వందేళ్ళ కిందటనే వాడుకభాషలో విద్యాబోధన వుండాలని వాదించి, ప్రతిపాదించిన గురజాడ కృషి వల్లనే ఈరోజున ఇంత హాయిగా, నిరలంకారంగా మంచి వచనశైలిని సమకూర్చుకోగలిగాం. భాషకు సంబంధించిన చాలా అంశాల్లో ఆయన ప్రతిపాదించిన సూత్రాలు ఎంత అవసరమైనవో తర్వాత కాలంలో తెలిసింది. చలం, శ్రీశ్రీల కన్నా ముందే కవిత్వంలో, కథల్లో, ఇతర వచనరచనల్లో వాడుకభాషను ఉపయోగించి మార్గాన్ని సుగమం చేశారు. నిందలు, నిష్టూరాలు, దూషణలు ఎన్నిటినో ఎదుర్కొని వాడుకభాష అవసరాన్ని నొక్కిచెప్పారు గురజాడ. వారి దృష్టి వైశాల్యం ఎంత నికార్సయినదో కాలం రుజువు చేసింది.

భాష విషయంలోనే కాదు స్త్రీల విషయంలో ఆయన చూపిన ఔదాత్త్యం, గౌరవనీయ దృష్టి తర్వాత తరం కవుల్ని, రచయితల్ని ప్రభావితం చేసింది. ఆయన సృష్టించిన 'మధురవాణి' పాత్ర ఆడవాళ్ళను ఉదాత్తస్థానంలో నిలబెట్టింది. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ మరోరకమైన చైతన్యాన్ని ఇచ్చింది. కథల్లోని స్త్రీల పాత్రలు ఎంతో విజ్ఞతతో మెలిగాయి. వందేళ్ళ కిందటనే స్త్రీల చైతన్యాన్ని సరిగ్గా అంచనా వేసిన సృజనశీలి గురజాడ. అందువల్లనే 'ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది' అనగలిగారు. గురజాడ వెళ్ళిపోయిన వందేళ్ళ తర్వాత సమాజాన్ని పరికిస్తే గురజాడ మాట నిజమవుతున్న దృశ్యం ఎల్లెడలా కనిపిస్తోంది. కనుకనే గురజాడ అడుగుజాడ ప్రతి తరానికి ఒక వెలుగుజాడ.

ఆంగ్లభాషలో ప్రావీణ్యం సంపాదించి అత్యున్నత ప్రతిభతో రచనలు చేయగలిగిన గురజాడ తెలుగుభాషకే పరిమితమయ్యారు. తెలుగుభాషలో, సాహిత్యంలో, సమాజంలో రావాల్సిన మార్పుల అవసరాన్ని గుర్తించారు. ఆ మార్పులకు శ్రీకారం చుట్టేందుకు తెలుగులో వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు. ఈ రీతిన తెలుగు సమాజంలో నవీన భావాలు పాదు కొల్పడానికి గురజాడ చేసిన కృషి ప్రభావం అనంతంగా కొనసాగుతూనే వుంది.

స్త్రీవాదం గురించి ఇవాళ మాట్లాడుతున్నారు గానీ, అలనాడే స్త్రీల విముక్తికి చదువు అవసరం ఏమిటో గుర్తించారు గురజాడ. చదువు ఆడవాళ్ళ జీవితాల్లో తీసుకువచ్చే మౌలికమర్పుల గురించి చెప్పారు. ఆయన మాటలు అక్షరసత్యాలని తర్వాతి కాలపుటనుభవాలు నిరూపించాయి. మొత్తం తెలుగునాట సమాజం ముందుకు వెళ్ళడానికి గురజాడ వ్యక్తం చేసిన భావాల పరంపర అనేకవిధాల ఉపకరించింది. వారి అవసరం తీరేంత ఉన్నతస్థాయిలో సమాజం ఎదగలేదు. గురజాడ అవసరం మిగిలేవుంది. అందువల్లనే లోకం నుంచి వెళ్ళిపోయిన వందేళ్ళ తర్వాత కూడా తెలుగు సమాజంలో గురజాడ నిలిచివున్నారు. వారి భావధార చోదకశక్తిగా పనిచేస్తోంది. ఎంతకాలం బతికామని కాదు, బతుకు నుంచి వెళ్ళిపోయాక కూడా ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం. అలా నిలిచి వెలగడమే మనిషి జీవితానికి ధన్యత. ఇదే గురజాడ జీవితం, మరణానంతర కాలం చెప్పే సత్యం.

– అశోక్‌కుమార్, 97000 00948

■ కవర్ స్టోరీ

చికిత్స లేదు, చైతన్యమే రక్ష

దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రపంచాన్ని కదిపి కదుపుతున్న సమస్య ఎయిడ్స్. మరీ ముఖ్యంగా 1990ల కాలం నుంచి ఎయిడ్స్ మీద విపరీతమైన ప్రచారం సాగుతోంది. చికిత్స లేని మహమ్మారి ఎయిడ్స్. మందుల్లేని వ్యాధిని నయం చేయడం ఎలా సాధ్యం? జబ్బు రాకుండానే జాగ్రత్త పడాల్సిందిగా చెబుతుంటాం. ఇది వైద్యుని ధర్మం. ఎయిడ్స్ విషయంలోనే కాదు, ఏ జబ్బు అయినా రాకుండా ఆరోగ్యకరమైన అలవాట్లతో జీవించాల్సిందిగా చెప్పడం డాక్టర్ల లక్షణం. వైద్యుల మాట వింటే సమాజమూ, మనుషులూ ఆరోగ్యంగానే ఉంటారు. కానీ మాట వినే లక్షణం మనుషులందరికీ ఉండదు. కనుకనే రకరకాల జబ్బుల బారిన పడుతుంటారు. మందులున్నాయి కదా పర్లేదులే అనే ధోరణి వుంటుంది. ఈ వైఖరి ఇతర జబ్బుల విషయంలో అంత ఇబ్బంది కాదు. జబ్బు పడినా కొన్నాళ్ళకు కోలుకోవచ్చు. కానీ మందుల్లేని మహమ్మారి, చికిత్సకు లొంగని మాయరోగం ఎయిడ్స్. అందుకే అప్రమత్తంగా ఉండడం అవసరం.

పరిశోధనలు

చికిత్స లేదని తెలిసినప్పుడు చైతన్యవంతంగా వ్యవహరించాలి. వ్యాధి సోకే పరిస్థితులు రాకుండా జాగ్రత్తపడాలి. అయితే వ్యాధి ఎందుకు వ్యాపిస్తుందో, వ్యాధి వచ్చాక జీవితకాలం పొడిగించడం ఎలా సాధ్యమో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. మన దేశం లోనూ ఇందుకోసం 'జాతీయ ఎయిడ్స్ పరిశోధనా కేంద్రం' ఏర్పాటు చేశారు. హెచ్ఐవి రాకుండా నిరోధించే టీకా ఉత్పత్తి కోసం ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ ఇపటివరకు అలాంటి వ్యాక్సిన్ కనుగొనలేదు. కనుక్కోవడం కోసం వివిధస్థాయిలలో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ పరిశోధనల్లో పుణేలోని జాతీయ ఎయిడ్స్ పరిశోధనా కేంద్రం కూడా భాగస్వామిగా వుంది.

రుగ్మతల ప్రభావాన్ని తగ్గించడం సాధ్యం

శరీరంలో రోగనిరోధక శక్తిని హరించడమే హెచ్ఐవి వైరస్ చేసే పని. ఆ వైరస్ మీద పోరాడే వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. అందువల్లనే ఇది దేహంలోని హెచ్ఐవీ వైరస్ మీద పనిచేస్తుంది. ఇది దేహంలోని ఇతర భాగాలకు సోకకుండా నిరోధిస్తుంది. ఇతర శరీరభాగాలపై వైరస్ ప్రభావం పడకుండా ఉపయోగపడుతుంది. తద్వారా రోగనిరోధకశక్తి వేగంగా తగ్గడమనే ప్రక్రియని నిలువరించగలదు. అందువల్ల ఇతరత్రా రుగ్మతలు దరి చేరకుండా జాగ్రత్త పడితే హెచ్ఐవి వైరస్ సోకిన మనుషులు కూడా తమ జీవితకాలాన్ని పొడిగించుకోవడం సాధ్యం.

ఆత్మస్థైర్యం, క్రమశిక్షణ

ఈ నిజాన్ని గ్రహించి, ఆత్మస్థైర్యంతో, క్రమశిక్షణతో వ్యవహరిస్తే జీవితకాలాన్ని పొడిగించుకోవడం సాధ్యం. అందుకని హెచ్ఐవి పాజిటివ్ పర్సన్ వున్న వ్యక్తి వెంటనే చనిపోతానేమో అని తల్లడిల్లకూడదు. హెచ్ఐవి పాజిటివ్ అంటే ఎయిడ్స్‌ను వ్యాప్తి చేసే వైరస్ దేహంలో వుందని మాత్రమే అర్థం. కనుక దీని ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలి. ఎయిడ్స్‌ని పూర్తిగా తగ్గించే మందులు లేవు. కానీ ఎయిడ్స్ వల్ల వచ్చే రుగ్మతల నివారణకు మందులున్నాయి. అంతేగాక హెచ్ఐవి చికిత్సకు ఉపకరించే యాంటీ రిట్రోవిరల్ థెరపీ రోగిని పూర్తిగా పరీక్ష చేసి ఒక నిర్ధారణకు వచ్చాక మొదలుపెట్టాలి. ఈ విషయంలో జాగ్రత్త వహించి డాక్టర్ల సలహాలు స్వీకరించి, వారి సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలి. ఎప్పటికప్పుడు డాక్టర్ల దగ్గర పరీక్షలు చేయించుకుంటూ మందుల వాడకంలో మార్పులు చేసుకోవాలి.

తోడ్పాటు గొప్ప ఓదార్పు

హెచ్ఐవి పాజిటివ్ వున్న మనుషుల పట్ల దయతో వ్యవహరించడం, వారిని సాటి మనుషులుగా గుర్తించి మామూలుగా ఉండాలి. తమలో భాగమే తప్ప వేరు కాదన్న భరోసా కల్పించాలి. ఎందుకంటే ఇది అంటువ్యాధి కాదు. తుమ్ముల వల్ల, కౌగిలింతల వల్ల, స్పర్శ వల్ల, వ్యాధిగ్రస్తుని బట్టలు ధరించటం వల్ల వ్యాధి సోకదని ఎప్పుడో తేలిపోయింది. అందువల్ల ఒక డయాబెటీస్, రక్తపోటు వున్న వ్యక్తులతో ఎంత సాధారణంగా వ్యవహరిస్తామో అంతే సాధారణంగా ఉండాలి. వైరస్ వున్న వారితో లైంగిక సంపర్కం వల్లనే వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. ఈ సంపర్కం లేకుండా కలిసి మెలిసి జీవించడం వల్ల, ఒకేచోట కలిసి తినడం వల్ల, స్నేహంగా వుండడం వల్ల ఎయిడ్స్ రాదు. ఈ గ్రహింపు అవసరం. అందుకని పాజిటివ్ వున్న వ్యక్తులతో కూడా సానుకూలంగా ఉండటం, వారి పట్ల స్నేహంగా, ప్రేమగా ఉండడం మంచిది. దీని వల్ల వారిలో ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. చావు గురించిన చింతన లేకుండా తమ తమ రంగాల్లో పనులు చేసుకుంటూ జీవిస్తారు. సాటి మనుషుల తోడ్పాటు వైరస్ వున్నవారికయినా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకయినా పెద్ద ఉపశమనం. దీనికోసం సమాజంలో మార్పు రావాలి. ఈ చైతన్యం అందరిలో పాదుకోవాలి. హెచ్ఐవి/ఎయిడ్స్ రావడానికి కారణాలు భిన్నంగా వున్నాయి. అందుకని వ్యాధి వచ్చినవారి గుణగణాల్ని ఎంచకూడదు. సాటిమనుషులన్న కరుణతో వ్యవహరిస్తే మందుల కన్నా అదే ఎక్కువ ప్రభావితం చేసి జీవిత కాలాన్ని పొడిగిస్తుంది.

భయకంపితమైన వాస్తవాలు



మనదేశంలో ఎయిడ్స్ వ్యాప్తిని నియంత్రించడం కోసం, ప్రజల్లో ఈ వ్యాధి పట్ల చైతన్యం తీసుకు వచ్చేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఎన్.ఎ.సి.ఓ–న్యాకో)ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో1992లోనే ఏర్పాటయింది. 1981లో ప్రపంచంలోనే మొట్టమొదటి ఎయిడ్స్ వ్యాధిని గుర్తించారు. తర్వాత 11 సంవత్సరాలకి దేశంలో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. దీనిని బట్టి ఎయిడ్స్ మహమ్మారిని గురించి ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరాలు పెరిగినందునే న్యాకో ఏర్పాటు తప్పనిసరయింది. ఇందుకోసం కోట్ల రూపాయల నిధులు ఏటా విడుదలవుతున్నాయి. ఎయిడ్స్ నియంత్రణ కోసం వందలాది స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. అపోహలు తొలగించడం, వ్యాధి సోకిన వారిలో స్థైర్యాన్ని పెంచడం ఇతరత్రా అనేక విధులు నిర్వహిస్తోంది ఈ సంస్థ. ఎయిడ్స్ గురించి సిలబస్‌లో తప్పనిసరి అంశం చేయాలని 2010లో న్యాకో నిర్దేశించింది. హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులు ఎక్కువగా ఉన్న దేశాల్లో మూడో స్థానంలో వుంది మనదేశం.

2013 సంవత్సరంలో అందుబాటులోకి వచ్చిన గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల మంది హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడ్డారు. ఇదే ఏడాది దాదాపు లక్షా ముప్పయి వేల మంది ఎయిడ్స్ కారణంగా మరణించారు. ముఖ్యంగా నాలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు మహారాష్ట్ర) లో హెచ్ఐవి/ఎయిడ్స్ సోకిన వారు అధికంగా ఉన్నారు.

దేశంలో ఎనిమిది లక్షల అరవై ఎనిమిది వేల మంది సెక్స్ వర్కర్లు ఉండగా వారిలో 2.7 శాతం మందికి హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడ్డారు. లైంగిక సంపర్కం కారణంగా సెక్స్‌వర్కర్లయిన మహిళల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. అలాగే మగవారితో మగవారి సంపర్కం వల్ల కూడా హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి బారిన పడుతున్నారు. 2009లో ఒకే జెండర్ గలవారి నడుమ సెక్స్ నేరం కాదని 2009లో ఢిల్లీ హైకోర్టు చెప్పింది. కానీ 2013 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఒకే జెండర్‌కు చెందిన వారి నడుమ లైంగిక సంపర్కం నేరం. హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడే ప్రమాదముందన్న చైతన్యం ఈ తీర్పుల ఫలితంగా వ్యాప్తి చెందింది. మనిషి లైంగిక స్వేచ్ఛ మీద తీర్పులేమిటనే వ్యాఖ్యానాలు వినిపించినప్పటికీ, హెచ్ఐవి/ఎయిడ్స్‌ని దృష్టిలో పెట్టుకొని తీర్పును సమర్థించినవారు ఎక్కువగానే ఉన్నారు. ఆరోగ్యకోణంలోంచి

చూసి, తీర్పు సారాంశాన్ని అర్థం చేసుకోవాలి.

హెచ్ఐవి పరీక్షల, కౌన్సెలింగ్ కేంద్రాలు 1997లో కేవలం 67 మాత్రమే. ఇప్పుడు వాటి సంఖ్య 15000 కి పెరిగింది. కౌన్సెలింగ్ హెచ్ఐవి/ఎయిడ్స్ సోకినవారికి అందించాలి. ఇది బతుకు మీద భరోసాని పెంచే మొదటి పని.

మన వైద్యవిధానాల్లో

వివిధ వైద్యవిధానాల్లో హెచ్ఐవి పాజిటివ్ వారిలో వచ్చే రుగ్మతల నివారణకు మందులున్నాయి. ఆయుర్వేదంలోనూ తగిన మందులు లభిస్తున్నాయి. హెచ్ఐవి/ఎయిడ్స్ వచ్చిన వారి ఆరోగ్యస్థితిని బట్టి ఎలాంటి మందులు ఇవ్వాలో సూచించడం వీలవతుంది. ముఖ్యంగా దేశీయ వైద్యవిధానమయిన ఆయుర్వేదంలో మనిషి రోగనిరోధకశక్తిని ఇనుమడింపజేసే మందులున్నాయి.

మందులతో చికిత్స అన్న సూత్రమే కాకుండా మొత్తం జీవనశైలిలో రావలసిన మార్పుల్ని ఆయుర్వేదం సూచిస్తోంది. వ్యాధిబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయుర్వేదం నొక్కిచెబుతుంది. నిరంతరం ఆరోగ్యకరమైన అలవాట్లతో జీవించే మనుషుల దరి చేరవు ఇలాంటి జబ్బులు. అందుకని జీవనవిధానంలో మార్పుల అవసరాన్ని వక్కాణించి చెప్పడం ఆయుర్వేద వైద్యవిధానంలో భాగం. విలువలతో కూడిన ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రతి మనిషికి శిరోధార్యం. దీనిని గుర్తించే చైతన్యం వ్యాప్తి చేయడం ద్వారా దేశంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌ని ఎదుర్కోవడం సాధ్యం.

ప్రతి దశలో పరీక్షలు

పెళ్ళికి ముందే హెచ్ఐవి/ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని అనేవారు లేకపోలేదు. దీనిని తప్పుపట్టలేము. ఈ మాట కోరినవారిని ఆక్షేపించక్కర్లేదు. నమ్మకం లేని చోట వైద్యాన్ని ఆశ్రయించడం అనివార్యం. ముఖ్యంగా మాట్రిమోనియల్స్ ద్వారా తమకు తగిన జోడును ఎంచుకోవాలనుకునేవారు. ముప్పయ్యేళ్ళ తర్వాత వివాహ జీవితంలోకి అడుగు పెట్టేవారు హెచ్ఐవి/ఎయిడ్స్ పరీక్ష చేయించుకోవలసిందిగా అడిగితే అభ్యంతరం చెప్పనవసరం లేదు. కేవలం లైంగిక సంపర్కం వల్లనే కాదు, ఇతరేతర కారణాల వల్ల వ్యాధి సోకే ప్రమాదం ఉన్నప్పుడు పరీక్షలు చేయించుకోవడమే శ్రేయస్కరం. గర్భిణీ స్త్రీలు కూడా ఈ పరీక్షలు చేయించుకోడం ఉత్తమం. అందుకని జీవితంలోని వివిధ దశలలో, అనుమానం వచ్చిన సందర్భాల్లో హెచ్ఐవి/ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోడానికి బిడియ పడక్కర్లేదు. ముందుజాగ్రత్తలు తీసుకోవడానికి ఇది తప్పనిసరి.

మరీ ముఖ్యంగా జీవితాన్ని క్రమశిక్షణతో గడపడంలోనే ఆరోగ్యం వుంది. ఇలాంటి వ్యాధుల బారినపడకుండా ఉండటం సాధ్యం.

వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ భరోసా

ఎయిడ్స్ వ్యాధితో బాధపడే ప్రభుత్వ ఉద్యోగులు 18 నెలల పాటు వేతనంతో కూడిన సెలవు పొందే వెసులుబాటు తమిళనాడు ప్రభుత్వం కల్పించింది. ఇప్పటివరకు క్యాన్సర్, టీవీ, గుండె, మూత్రపిండాలు, నేత్ర సంబంధిత శస్త్రచికిత్సలకు మాత్రమే వేతనంతో కూడిన దీర్ఘకాలిక సెలవు మంజూరు చేసేవారు. అయితే ఎయిడ్స్ కలిగిన ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడటంతోబాటు, వారికి ప్రభుత్వం అండగా వుందన్న భరోసా కల్పించడానికి అక్కడి ప్రభుత్వం 2009లో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే దారిద్ర్యరేఖకు దిగువన వున్న హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు నెలకు 200 రూపాయలు ఫించన్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఇది 2014 ఏప్రిల్ నుంచి అమలవుతుందని ప్రకటించింది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పేదలను ఆదుకునే నిర్ణయాలు తీసుకుంటే ఈ మహమ్మారి బారిన పడిన వారికి కొంతలో కొంత ఓదార్పు లభిస్తుంది.

ఆర్థికంగా స్థిరచరాస్తులున్నవారు హెచ్ఐవి పాజిటివ్ సోకితే కోలుకోడానికి స్థయిర్యం ఉంటుంది. జీవన కాలం పొడిగించుకునేలా జాగ్రత్తలు తీసుకోగలరు. తగిన మందులు, తగిన ఆహారం లభిస్తాయి. పేదరికంలో మగ్గేవారు దీని బారిన పడితే దిగాలు పడతారు. ఆర్థికపరమైన ఇబ్బందులుండటం, అండదండలు లేకపోవడం వల్ల త్వరగా చనిపోతున్నారు. మనదేశంలో ఈరకమైన మరణాలే ఎక్కువ. హెచ్ఐవి/ఎయిడ్స్ కారణంగా చనిపోతున్నవారి ఆర్థిక, సామాజిక నేపథ్యాల గురించి పరిశోధనలు జరిగితే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఈ వాస్తవాలని బట్టి బాధితులకు ఇంకా ఎలా తోడ్పడాలో ఆలోచించడం సాధ్యం. కనుక హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి మాట్లాడేటప్పుడు సామాజిక, ఆర్థిక కోణాల్ని జాగ్రత్తగా పరిశీలించాలి.

అలవాట్లలో, నైతికవిలువలు పాటించడంలో నిబద్ధంగా వ్యవహరించాలి. ఇలా వ్యవహరించాలన్న చైతన్యం సకల వర్గాల్లో తీసుకురావాలి. మనిషికి ఉన్నది ఒక్కటే జీవితం. ఆ జీవితాన్ని నిండుగా, హాయిగా గడిపేందుకు ఆరోగ్యం ప్రధానం. అందుకే నిరంతర అప్రమత్తత మనిషికి శ్రేయస్కరం.

– డాక్టర్ డి.శ్రీరామమూర్తి, 98852 97983

ఘంటసాల గానామృతం

మధురమైన కంఠానికి అర్థవంతమైన సాహిత్యం, వినసొంపైన సంగీతం తోడైతే వచ్చే పాటలు ఎలా ఉంటాయో తెలియాలంటే ఘంటసాల పాటలు వినాల్సిందే. ఆయన పాడిన గీతాలు కొన్ని...

భార్యాభర్తల బంధం ఎవరెన్ని చెప్పినా నిత్యనూతనంగానే ఉంటుంది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత గాఢ ప్రేమ ఇరువురి మధ్య ఉంటేనే ఆ సంసారం నిలుస్తుందని చెప్పే పాట 'మంచి మనసులు' చిత్రంలో ఆచార్య ఆత్రేయ సాహిత్యానికి కె.వి.మహదేవన్ సంగీతం వహించిన "నన్ను వదలి నీవు పోలేవులే... అది నిజములే... పూవు లేక తావి నిలువలేదులే...", ఇదే చిత్రంలో మరో పాట "శిలలపై శిల్పాలు చెక్కినారు, మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు". విజయనగర సామ్రాజ్యంలోని శిల్పకళా వైభవాన్ని తెలుపుతుంది ఈ పాట.

ప్రపంచమంతా డబ్బు చుట్టూనే తిరుగుతుంది. ఈ రోజుల్లో డబ్బు సంపాదించలేని వారికి విలువ, గౌరవం లేదు. ఓపిక, వయసు ఉన్నప్పుడే సంపాదించాలని చెప్పే పాట 'లక్ష్మీ నివాసం' చిత్రంలోని "ధనమే అన్నిటికీ మూలం, ఆ ధనము విలువ తెలుసుకొనుట మానవ ధర్మం".

'ఏకవీర' చిత్రంలో తొలిసారి ఘంటసాలతో కలిసి బాలసుబ్రహ్మణ్యం పాడిన పాట "ప్రతిరాత్రీ వసంత రాత్రి, ప్రతిగాలి పైరగాలి". సి.నారాయణ రెడ్డి సాహిత్యానికి కె.వి.మహదేవన్ సంగీతంతో హాయిగా సాగిపోయే పాట.

అర్థం చేసుకునే భార్య, పుట్టింటిని మరిపించగలిగేంత ప్రేమను అందించే భర్త ఉండగా ప్రేమయాత్రలకు బృందావనం, నందనవనం

అవసరం లేదని హృదయానికి హత్తుకునేలా రాశారు పింగళి. ఈ సాహిత్యానికి ఘంటసాల సంగీతంతో వీనుల విందుగా సాగుతంది 'గుండమ్మ కథ'లో చిత్రంలోని "ప్రేమయాత్రలకు బృందావనము నందనవనము ఏలనో" పాట.

విద్యార్థులకు బడి ఎంత ముఖ్యమో భక్తి పరులకు దేవుడూ అంతే. కొంతమంది దళారులు భక్తి పేరుతో దోపిడీ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ విషయం ఇప్పుడే కాదు నాలుగు దశాబ్దాలకు ముందు కూడా ఈ పరిస్థితి ఉందని 'బుద్ధిమంతుడు' చిత్రంలోని పాట వింటే తెలుస్తుంది. చదువు విలువ ప్రహ్లాదుడు కూడా చెప్పినట్లు పురాణాల్లో ఉంది. ఈచిత్రంలో కొసరాజు రాసిన "గుడిలో ఏముందీ బాబూ బడిలోనే వుంది. భుక్తి శక్తి కావాలంటే" పాట ఎంత అర్థవంతంగా రాశారో కె.వి.మహదేవన్ సంగీతంలో ఘంటసాల స్వరం నుండి వింటుంటే ఇంకా బాగుంటుంది.

ఘంటసాల మెలోడీ గీతాలు, విషాద గీతాలే కాదు, హాస్యరస గీతాలు కూడా పాడి మెప్పించారనడానికి ఉదాహరణ 'మాయాబజార్' చిత్రంలోని "సుందరి నీ వంటి దివ్యస్వరూపము ఎందెందు వెతికిన లేదుకదా" పాట. ఇందులో రేలంగే పాడారా అనిపిస్తుంది ఈ పాట వింటుంటే. రేలంగి అభినయానికి ఘంటసాల గాత్రం తోడై మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుంది.

'గులేబకావళి కథ' చిత్రంలో సినారె రాసిన "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని... కన్నులలో దాచుకుందు నిన్నే నా స్వామి" పాట వింటే ఘంటసాల గాత్రంలోనే వినాలనిపిస్తుంది. ఏయన్నార్ అభినయానికి తగ్గట్టు గొంతులో కొంటెతనం, ప్రేమ కలగలిపి పాడిన పాటకు జోసెఫ్, విజయా కృష్ణమూర్తి సంయుక్తంగా సంగీతం అందించారు.

ఇలా ఎన్నో వేలపాటలు ఘంటసాల గొంతునుండి జాలువారాయి. ముఖ్యంగా ఘంటసాల పాడిన భక్తి గీతాలు, పద్యాలు, భగవద్గీత... ఇలా ఎన్నో శ్రోతల్ని సంగీత సాగరంలో ముంచేస్తాయి. ఘంటసాల లాంటి గొంతు మళ్లీ ఇంత వరకు రాలేదంటే అతిశయోక్తికాదు.

ఆనకట్టల వల్ల ఎన్ని ఉపయోగాలో అందరికీ తెలిసిన విషయమే. వ్యవసాయానికి, తాగునీటికి... అన్నిటికీ నీళ్లు అవసరం. నీళ్లు సముద్రం పాలవ్వకుండా ఎంత కష్టమైనా ఆనకట్టలు కడితే ఆ నీళ్లతో పంటలు పండి కష్టాలు తీరతాయి. 'రాముడు భీముడు' చిత్రంలో సి.నారాయణ రెడ్డి రాసిన "దేశమ్ము మారిందోయ్ కాలమ్ము మారిందోయ్" పాటలకు పెండ్యాల సంగీతం అందించారు.

అద్దం లాంటి మంచి మనసుండాలి కానీ రూపు ముఖ్యం కాదు, మనుషుల మీద అభిమానం చూపించి, మర్యాదగా ప్రవర్తించే గుణం అన్నిటికంటే ప్రధానం. 'కలసి ఉంటే కలదు సుఖం' చిత్రంలో కొసరాజు సాహిత్యం అందించిన "ముద్దబంతి పూలు పెట్టి మొగలి రేకుల జడను చుట్టి" పాటకు మాస్టర్ వేణు సంగీతం తోడై ఘంటసాల గాత్రంలో వింటేనే ఈ పాటకు అందం వచ్చిందా అనిపిస్తుంది.

- బి.మల్లేశ్వరి

■ **కథ : హరికిషన్**

ఒకూర్లో ఒక రైతుంటాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్ళు. వాళ్ళందరికీ పెళ్ళి వయసొచ్చింది. దాంతో ఆ రైతు సంబంధాల కోసం వెదుకసాగాడు. ఒకసారి ఆ ముగ్గురు అమ్మాయిలు కడవలు తీసుకొని నీళ్ళ తేవడానికి చెరువుకాడికని పోయినారు. నీళ్ళు ముంచుకుంటా... ముంచుకుంటా "ఏమే... నాన్న సంబంధాలు చూస్తా వున్నాడు. నువ్వెవరిని చేసుకుంటావే... అంటే... నువ్వెవరిని చేసుకుంటావే" అని ఒకర్నొకరు అడుక్కోసాగారు.

బంగారుపక్షి

అదే సమయంలో ఆ వూరి యువరాజు మారువేషంలో అటువైపు వచ్చినాడు. వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో విందామని ఒక పొద దాపున కూర్చున్నాడు.

అందరికంటే పెద్దామె "నేను ఈ రాజ్యాన్ని కాపాడే సేనాధిపతిని చేసుకుంటా... నాకు యుద్ధాలన్నా, పోరాటాలన్నా చాలా ఇష్టం" అనింది.

రెండో ఆమె "నేను తన ఎత్తులు జిత్తులతో ఈ రాజ్యాని ప్రశాంతంగా వుంచే మంత్రిని చేసుకుంటా... నాకు సలహాలివ్వడమన్నా, సమస్యల్ని పరిష్కరించడమన్నా చాలా ఇష్టం" అనింది.

చిన్నామె "నేను ఈ రాజ్యాన్ని పాలించే యువరాజును చేసుకుంటా... నాకు దాసదాసీలతో సేవలందుకోవడమన్నా, సింహాసనం మీద రాజు పక్కన కూర్చొని ప్రజల్ని పాలించడమన్నా చాలా ఇష్టం" అనింది.

అంతలో పెద్దామె "పదపద... ఆలస్యమైపోతావుంది. మనం ఇలా పొద్దుపోక వుత్తుత్త కలలు కనాల్సిందే గానీ... ఇవన్నీ నిజమవుతాయా... పాడా... మన నాన్న ఏ తలకు మాసినోన్ని తెచ్చినా తలొంచుకోని తాళి కట్టించుకోవడం తప్ప ఏం చేయగలం" అనింది. ముగ్గురూ కడవలు సంకన పెట్టుకోని గమ్మున ఇంటిదారి పట్టినారు.

యువరాజు వాళ్ళ మాటలన్నీ విన్నాడు. ముగ్గురినీ చూసినాడు. ముగ్గురూ చాలా చక్కగా చందమామల్లెక్క వంక బెట్టడానికి లేకుండా వున్నారు. "అరే... పాపం... ఈ అమ్మాయిలెవరో గానీ వీళ్ళ కోర్కెలు తీరుద్దాం. వీళ్ళకేం కన్నొంకరా... కాలొంకరా... చక్కగా పాలమీగడ లెక్కున్నారు" అనుకున్నాడు. వెంటనే అంతఃపురానికి పోయి మంత్రినీ, సేనాధిపతినీ పిలిచి జరిగిందంతా చెప్పి మనం ముగ్గురమూ వాళ్ళ ముగ్గురినీ పెళ్ళాడుదాం అన్నాడు. రాజే సరే అన్నాక మిగతా వాళ్ళదేముంది... వాళ్ళు గూడా సరే అన్నారు. తర్వాత రోజు ముగ్గురూ కలసి రైతు ఇంటికి పోయినారు. స్వయంగా తమను పాలించే రాజు, మంత్రి, సేనానే తమ ఇంటికి అల్లుళ్ళుగా వస్తామనే సరికి రైతు చానా సంబరపన్నాడు. వాళ్ళు కోరుకున్నట్టే వారికి నచ్చిన వాళ్ళనిచ్చి పెండ్లి చేసినాడు.

పెద్దామె సేనాధిపతి పెండ్లాం అయితే, నడిపామె మంత్రి పెండ్లాం అయితే, చిన్నామె రాజ్యానికి యువరాణి అయింది. దాంతో చిన్నామెకు అడుగడుగునా దాసీలే. ఆమె భోగమే భోగం. పన్నీటి స్నానాలు, మెత్తని హంసతూలికా తల్పాలు, ఏడువారాల నగలు, లెక్కబెట్టుకోలేనన్ని పట్టు వస్త్రాలు... ఒకటని కాదులే... కనుసైగ చేస్తే చాలు కోరుకున్నవన్నీ కాళ్ళముందు కొచ్చేవి. అదంతా చూసి పెద్దామెకు, నడిపామెకు కన్ను కుట్టింది. "ఛ... ఛ... ఆ రోజు చెరువుకాడ ఆ మాటలంటున్నప్పుడు అవి నిజమవుతాయని కలలో గూడా అనుకోలేదు. లేకుంటే మనం గూడా యువరాజే మొగుడు కావాలని కోరుకుంటుంటిమి. మనందరికన్నా చిన్నదయినా దీనికేమి అదృష్టం పట్టింది. ఎలాగయినా సరే వీళ్ళిద్దరినీ విడదీయాలి" అనుకోసాగినారు.

చూస్తుండగానే గంటలు రోజులై, రోజులు వారాలై, వారాలు నెలలై... ఆ చిన్నపిల్లకు మిగతా ఇద్దరికన్నా ముందే కడుపు పండింది. అది చూసి యువరాజు చానా సంబరపన్నాడు. కాలు కిందపెట్టనీయకుండా పసిపిల్లలెక్క అల్లారుముద్దుగా చూసుకోసాగినాడు. ఆమె ఏమడిగితే అది... ఎంత ఖరీదయినా సరే తెప్పించసాగినాడు. ఒక పూట తిన్న వంట మరొకపూట తినకుండా దేశదేశాలనుండి పేరు మోసిన వంటగాళ్ళనందరినీ పిలిపించి అమృతం లాంటి వంటకాలన్నీ చేయించి పెట్టసాగినాడు. ఇదంతా చూస్తున్న కొద్దీ అక్కలిద్దరికీ మరింతగా మండిపోసాగింది. పైకి నవ్వుతా ఇకఇకలాడుతావున్నా... లోపల మాత్రం కుతకుతా వుడికిపోతావున్నారు. ఎప్పుడెప్పుడు సందు దొరుకుతుందా... ఎప్పుడెప్పుడు దెబ్బ కొడదామా... అని ఎదురు చూడసాగినారు.

అలా ఒక్కొక్క నెల గడుస్తా... గడుస్తా... ఆ చిన్నపాపకు తొమ్మిది నెళ్ళు నిండినాయి. ఈ వారమా వచ్చేవారమా కానుపు అన్నట్టుంది. అంతలో అనుకోకుండా పక్కవూరి నుండి ఒకరాజు ఆ రాజ్యం మీదికి దండయాత్రకొచ్చినాడు. దాంతో యువరాజు తప్పనిసరై, సైన్యాన్ని తీసుకోని పోతా పోతా పెళ్ళాం అక్కలిద్దరినీ పిలిచి "మీ చెల్లెలు నిండుమనిషి. అక్కలైనా, అమ్మలైనా మీరే. కాస్త జాగ్రత్తగా చూసుకోండి" అని అప్పజెప్పినాడు. దానికి వాళ్ళు నవ్వుతా "దానిదేముందిలే యువరాజా! మీరు పోయిరండి. మేం కంటికి రెప్పలా కాపాడుకుంటాము" అన్నారు. పోయే ముందు యువరాజు పెళ్ళాంతో "ఏమే... నాకు ముద్దులు మూటగట్టే కొడుకునిస్తావా... చూడ చక్కనైన కూతుర్నిస్తావా... ఎవరినిస్తావు" అన్నాడు. దానికామె నవ్వుతా "ఏమో... నాకేం తెలుసు. దేవుడు కడుపున ఎవర్ని వేసింటే వాళ్ళనిస్తా" అనింది. దానికి యువరాజు "మరి నేను అంతదూరంలో వుంటాను గదా... నాకెట్లా తెలుస్తాది... ఎవరు పుట్టినారో" అన్నాడు. దానికామె చిరునవ్వు నవ్వుతా "ఏముంది... నేను కనగానే ఆకాశంలోంచి ముత్యాలవాన కురిస్తే కొడుకు పుట్టినట్లు, పగడాల వాన కురిస్తే కూతురు పుట్టినట్లు... ఏం సరేనా" అనింది. యువరాజు అలాగేనంటూ యుద్ధానికి వెళ్ళిపోయినాడు.

అలా పోయిన వారం రోజులకు ఆమెకు నొప్పులు మొదలయినాయి. అప్పుడు అక్కలిద్దరూ చెరోపక్కనచేరి “ఏం భయపడొద్దు చెల్లీ... మేమున్నాం గదా... కళ్ళు మూసుకొని కాసేపు బాధ బిగబట్టుకో, బోసినవ్వులు నవ్వే పాప పక్కనుంటాది” అంటూ కాన్పుకు తీసుకుపోయినారు. ఆమెకు కాసేపట్లో ముచ్చటగొలిపే కొడుకు పుట్టినాడు. వెంటనే అక్కలిద్దరూ ఆమె కళ్ళు తెరవకముందే మత్తుమందు కలిపిన నీళ్ళిచ్చి, ఆమె లేచేలోగా ఆ పిల్లవాన్ని అక్కన్నించి తీసుకొని పోయి ఒక పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలేసి, ఒక చచ్చిపోయిన పిల్లవాన్ని తెచ్చి పక్కన పన్నబెట్టినారు. ఆమె కిదంతా తెలీదు... దాంతో మత్తు దిగినాక కొడుకు చనిపోయి వుండటాన్ని చూసి బాధపడింది.

అక్కడ యువరాజు యుద్ధంలో వుండగానే ఆకాశంలోంచి ముత్యాలవాన కురిసింది. అది చూసి యువరాజు “ఆహా... నాకు ముత్యంలాంటి కొడుకు పుట్టినట్టున్నాడు” అని ఎంతగానో సంబరపన్నాడు. యుద్ధం పూర్తికాగానే ఎప్పుడెప్పుడు కొడుకును చూద్దామా అని సంబరపడతా బెరబెరా ఇంటికి చేరుకున్నాడు. కానీ అక్కడ పసిపాప నవ్వుల్లేవు. చనిపోయాడని తెలుసుకొని ఎంతగానో బాధపన్నాడు. ఐనా కాసేపటికి తమాయించుకొని “సరే.. జరిగిందేదో జరిగిందిలే... మనకు నుదుటన రాత రాసినట్టు లేదు. ఈసారి మాత్రం చూడచక్కనైన కూతురినివ్వు” అన్నాడు. మళ్ళా ఆమెను ఇంతకు ముందులాగే బాగా చూసుకోసాగినాడు.

ఇంతకు ముందు బాబును పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలినారు గదా... ఆపెట్టె కొట్టుకపోయి, కొట్టకపోయి ఒక ముసలి బాపనాయనకు దొరికింది. ఆయనకు పెళ్ళాం, పిల్లలు ఎవరూ లేరు. ఒక్కడే. పిల్లలకు విద్యను నేర్పిస్తావుంటాడు. ఆయన ఆ పసిపిల్లోన్ని చూసి “ఎవరు కన్న బిడ్డో ఏమో... పాపం... ఎంత కష్టమొచ్చిందో... ఇలా వదిలేసింది” అనుకోని పెంచుకోడానికి ఇంటికి తీసుకుపోయినాడు.

అలా కొంతకాలం గడిచినాక... ఆ రాజ్యంలో రైతులు వేసిన విత్తనాలు మొలకలై, మెలకలు మొక్కలై, మొక్కలు పూవులై, పూవులు కాయలై, కాయలు విత్తనాలై పంటలు ఇంటికి చేరుతావున్న దశలో యువరాణికి మళ్ళా కడుపు పండింది. ఈ సారి రాజు ఆమెని కాలు కిందపెట్టనీయకుండా అడుగడుగునా దాసీలని పెట్టి మరింత అపురూపంగా చూసుకోసాగినాడు. అలా ఒకొక్క నెలా దాట్తా కాన్పుకు దగ్గర పడింది.

అనుకోకుండా అప్పుడే ఆ రాజ్యాన్ని ఆనుకొని వుండే అడవుల్లో కొన్ని దొంగల ముఠాలు చేరినాయి. వాళ్ళు రోజూ గుంపులు గుంపులుగా వూర్లమీద పడి దొరికినోన్ని దొరికినట్టు చంపుకుంటా కనబడినదల్లా దోచుకోని పోసాగినారు. జనాలంతా భయపడి రాజు దగ్గరికిపోయి “రాజా! వాళ్ళు మామూలోళ్ళు గాదు. ఒకొక్కడు ఒకొక్క ఏనుగంత బలంగా వున్నాడు. వాళ్ళని ఆపడం మా వల్ల కాదు. మీరే మమ్మల్ని ఎలాగైనా కాపాడాలి. లేకుంటే వూర్లు వదిలిపోవడం తప్ప మాకు వేరే దారిలేదు” అని కాళ్ళమీద పన్నారు. రాజు ‘సరే’ అని పెళ్ళాన్ని పిలిచి “మళ్ళా కానుపప్పుడే పోవలసి వస్తా వుంది. ఈ సారి జాగ్రత్త. నేను వచ్చేసరికి బోసినవ్వులతో కిలకిలకిల నవ్వుతావున్న కొడుకునో కూతురినో నా చేతుల్లో పెట్టాలి. ఆరోగ్యం జాగ్రత్త” అని చెప్పి పోయినాడు.

అలా పోయిన వారం రోజులకు ఆమెకు నొప్పులు మొదలయినాయి. ఎప్పట్లాగే అక్కలిద్దరూ చేరోపక్కన చేరి “ఏం భయపడొద్దు చెల్లీ. మేమున్నాం గదా... కళ్ళు మూసుకోని కాసేపు బాధ బిగబట్టు. చిరునవ్వులొలికే చిన్నారి నీ పక్కనుంటాది” అంటా కాన్పుకు తీసుకుపోయినారు. ఆమెకు కాసేపటికి చందమామ లెక్క చక్కని పాప పుట్టింది. వెంటనే అక్కలిద్దరూ చెల్లెలికి మత్తుమందు కలిపిన నీళ్ళిచ్చి ఆమె లేచేలోగా ఆపాపను అక్కన్నుంచి తీసుకొనిపోయి ఒక పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలేసి, ఒక చచ్చిపోయిన పాపని తెచ్చి పక్కన పన్నబెట్టినారు.

ఆమెకిదంతా తెలీదు... దాంతో మత్తు దిగినాక కూతురు చనిపోయుండటాన్ని చూచి “అరే... అప్పుడు కొడుకు, ఇప్పుడు కూతురు. ఏమి రాత రాసినావురా భగవంతుడా నుదుటిమీద” అంటా కళ్ళనీళ్ళు పెట్టుకోనింది. అంతలో అక్కలిద్దరూ చొరోపక్కన చేరి “ఏం బతుకే నీది... ఎప్పుడూ చచ్చిపోయిన పిల్లోల్లని కంటా వున్నావు. పాపం ఎన్నో ఆశలతో వురుకులు పరుగుల మీద వచ్చే నీ మొగునికి నీ ముఖం ఎట్లా చూపిస్తావే” అంటూ సూటిపోటి మాటలన్నారు. దాంతో ఆమెకు చాలా బాధవేసి రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పా పెట్టకుండా ఆ రాజ్యాన్ని వదిలేసి ఎవరికీ కనబడనంత దూరం వెళ్ళిపోయింది. అక్కడ ఒక ఇంట్లో ఎవరూలేని అనాధనంటూ పనికి చేరి బదకసాగింది. అక్కలిద్దరూ చెల్లెలు వెళ్ళిపోవడంతో చానా సంబరపన్నారు.

అక్కడ అడవిలో దొంగలను వేటాడుతావున్న యువరాజు మీద ఆకాశంలోంచి పగడాల వాన కురిసింది. అదిచూసి యువరాజు “ఆహా.. ఈసారి నాకు చూడచక్కని కూతురు పుట్టినట్లుంది” అని సంబరపన్నాడు. కొద్దిరోజుల్లో దొంగలనంతా తరిమేసి పాపను చూడ్డం కోసం వురుకులు పరుగులమీద ఇంటి కొచ్చినాడు. కానీ అక్కడ పసిపాప కేరింతలు లేవు. అక్కలిద్దరూ దొంగ ఏడుపు ఏడుస్తా నీ పెళ్ళానికి ఈసారి గూడా చచ్చిపోయిననోళ్ళే పుట్టినారు. దాంతో నీకు మొహం చూపించలేక రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పా పెట్టకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది” అంటూ చెప్పినారు. పిల్లనే గాక పెళ్ళాం గూడా పోయినందుకు రాజు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ఇంతకు ముందు అక్కలిద్దరూ పెట్టెలో పాపను పెట్టి వదిలినారు కదా... అది కొట్టుకపోయి కొట్టుకపోయి... మళ్ళా అదే ముసలి బాపనాయనకు దొరికింది. ఆయన ఆ పాపను గూడా బైటకు తీసుకొచ్చి సొంత పిల్లలెక్క అల్లారు ముద్దుగా పెంచసాగినాడు. అలా అక్కడ కొంతకాలానికి పిల్లలిద్దరూ పెరిగి పెద్దగయినారు. ఆయన దగ్గర రకరకాల విద్యలు నేర్చుకున్నారు. ఆ బాపనాయన చానా ముసిలోడయిపోయినాడు. చనిపోయే ముందు ఇద్దరినీ పిలిచి “బాబూ... మీకు మీ పుట్టుక గురించి ఒక్క నిజం చెప్పాల. మీరు నా సొంత పిల్లలు కాదు” అంటూ జరిగిందంతా చెప్పి చనిపోయినాడు. పిల్లలకు తమ అమ్మానాన్నా ఎట్లుంటారో, ఎక్కడుంటారో తెలుసుకోవాలనిపించింది. కానీ చెప్పేవాళ్ళు ఎవరూ లేక బాధపడసాగినారు.

ఆ పిల్లల ఇంటిపక్కన ఒక తోట వుంది. దాంట్లో లోకంలో ఎక్కడా దొరకనన్ని రకరకాల పండ్ల చెట్లు వున్నాయి. వాటికోసం ఒక బంగారు పక్షి

అక్కడికి వచ్చింది. సూర్యుని కిరణాలుపడి దాని ఒళ్ళంతా ధగధగా మెరవసాగింది. లోకంలో ఎన్నో పక్షులు చూసినాంగానీ ఇంత అందమైన పక్షి ఎప్పుడూ చూడలేదు. దీన్ని పట్టి ఇంట్లో వుంచుకుంటే ఎంత బాగుంటుంది అనుకున్నారిద్దరూ. దాంతో వాళ్ళు నెమ్మదిగా దాక్కుంటా దాక్కుంటా దాని దగ్గరికి పోయినారు. లటుక్కున ఆ పక్షిని పట్టుకోబోతే అది అందినట్లే అంది చేయి తాకిన మరుక్షణమే టక్కున మాయమైపోయింది. మళ్ళీ ఎప్పుడూ అటువైపు రాలేదు.

అలా కొంతకాలం గడిచినాక ఒక సాధువు వాళ్ళ ఇంటికాడికి వచ్చినాడు. అది భోజనాల సమయం. పిల్లలిద్దరూ ఇంట్లో కూచోని అన్నం పెట్టుకుంటా వున్నారు. ఆ సమయంలో సాధువు "అమ్మా... ఆకలయితా వుంది. ఏమయినా వుంటే పెట్టండమ్మా... పొద్దున్నించీ ఏమీ తినలేదు. నీరసంగా వుంది' అన్నాడు. అన్నా చెల్లెళ్ళిద్దరూ అన్నం పళ్ళాల కాన్నించి లేచి బైటకొచ్చి సాధువుకు తమ కోసం వండుకున్నదంతా వేడివేడిగా పెట్టినారు. తోటలోంచి మంచి మంచి మాగిన పళ్ళు తెచ్చి ఇచ్చినారు. సాధువు కడుపునిండా తిన్నాక "పిల్లలూ... మీరు చేస్తున్న మర్యాదలకు చానా సంతోషం కలుగుతావుంది. నేను దేశమంతా ఒకసారి పోయిన చోటికి మరొకసారి పోకుండా తిరుగుతావుంటాను. అక్కడి వింతలూ విశేషాలు తెలుసుకుంటా వుంటాను. నాకు మాయలూ మంత్రాలు రావుగానీ అనేక విషయాలు మాత్రం తెలుసు. మీకేమయినా అటువంటివి తెలుసుకోవాలనుకుంటే అడగండి చెబుతాను" అన్నాడు.

> ***ఆయన ఆ పాపను గూడా బైటకు తీసుకొచ్చి సొంత పిల్లలెక్క అల్లారు ముద్దుగా పెంచసాగినాడు.***

అప్పుడు పిల్లలకు ఒకసారి తమ తోటలోకి వచ్చిన బంగారుపక్షి గుర్తుకు వచ్చింది. "స్వామీ... ఈ మధ్య మా తోటలోనికి ఒక బంగారుపక్షి వచ్చింది. మేము పుట్టి బుద్దెరిగినప్పటి నుండీ అటువంటి అందమైన పక్షిని ఎప్పుడూ చూడలేదు. వినలేదు. మీకేమయినా దాని గురించి తెలుసా" అని అడిగినారు.

దానికా సాధువు చిరునవ్వు నవ్వి "నాయనా... అది అట్లాంటిట్లాంటి మామూలు పక్షికాదు. ఏడేడు పద్నాలుగు లోకాల్లోనా అంత అందమైన పక్షి ఎక్కడా కనిపించదు. అంతే కాదు అది చానా మహిమలున్న పక్షి. ఇక్కడికి వుత్తరం వైపున ఏడువందల మైళ్ళ దూరంలో వరుసగా ఏడు కొండలున్నాయి. చివరి కొండమీద ఏడు మర్రిచెట్లు వున్నాయి. చివరి మర్రిచెట్టుకు ఏడు పెద్ద పెద్ద కొమ్మలున్నాయి. చివరి కొమ్మమీద ఏడు అందమైన గూళ్ళు వున్నాయి. అందులోని చివరి గూడులో ఈ పక్షి నివసిస్తా వుంటాది. కానీ దాని దగ్గరికి పోయిన వారిని ఎవరినైనా సరే అది ఏడు ప్రశ్నలడుగుతాది. సరియైన సమాధానం చెప్పావా... నీవు ఏ కోరిక కోరినా కాదనకుండా నెరవేరుస్తాది. తప్పు చెప్పినావా వెంటనే నిన్ను అక్కడికక్కడే రాయిగా మార్చి వేస్తుంది" అని చెప్పినాడు.

బాపనాయన దగ్గర చిన్నప్పటి నుంచీ వేదవేదాల్లో శిక్షణ పొందిన ఆ పిల్లోడు ఎలాగయినా సరే ఆ పక్షిని చేరుకొని అమ్మానాన్నల గురించి తెలుసుకోవాలి అనుకున్నాడు. తరువాత రోజు పొద్దున్నే దారిలో తినడానికి పళ్ళు, రొట్టెలు మూట కట్టిచ్చుకొని బైలుదేరినాడు. రాత్రనకా, పగలనకా నడిచీ చడిచీ చివరికి ఏడేడు పద్నాలుగు రోజులకు కొండలను చేరుకున్నాడు. గంటకో కొండను దాటుతా ఏడో గంటకు చివరి కొండను చేరుకున్నాడు. నిమిషానికో మర్రిచెట్టు దాటుతా ఏడో నిమిషానికి చివరి చెట్టు చేరుకున్నాడు. క్షణానికో గూడు దాటుతా ఏడో క్షణానికి చివరి గూడు చేరి తలుపు తట్టినాడు. అప్పుడు ఆ గూట్లోనుంచి ధగధగా మెరిసిపోతావున్న రెక్కలను విదించుకుంటా బంగారుపక్షి బైటకొచ్చింది. ఈ పిల్లోన్ని చూసి "చూడు... వచ్చిందారినే మర్యాదగా వెనక్కు తిరిగి చూడకుండా ఐనా వెళ్ళిపో... లేదా నేనడిగే ఏడు ప్రశ్నలకు సమాధానం చెప్పి నీకు కావలసినదన్నా తీసుకోవి పో" అనింది. అప్పుడా పిల్లోడు ఏ మాత్రం బెదపడకుండా "అడుగు చెబుతాను" అన్నాడు. ఆ పక్షి అడగడం మొదలు పెట్టింది. అదట్లా అడగడం ఆలస్యం ఆ పిల్లోడు క్షణం గూడా ఆలస్యం చేయకుండా టకీమని సమాధానం చెప్పడం మొదలు పెట్టినాడు.

1. లోకంలో అన్నిటికన్నా వేగమైనది ఏది?

జ. మనసు

2. ఎంత దాచినా దాగనిది ఏది?

జ. అబద్దం

3. పోతే తిరిగిరానిది ఏది?

జ. పరువు

4. ఎంత పంచినా తరగనిది ఏది?

జ. విద్య

5. భార్యాభర్తల మధ్య వుండాల్సినది ఏమిటి?

జ. నమ్మకం

6. మనషులు నాశనం కావడానికి కారణం?

జ. అసూయ

7. మనిషి గొప్పవాడయ్యేది ఎప్పుడు?

జ. ఇతరుల కోసం బతికినప్పుడు.

ఆ పిల్లోడిచ్చిన జవాబులన్నీ విని ఆ పక్షి చానా ముచ్చటపడింది. "ఆహా... ఇన్నాళ్ళ నుండి ఇక్కడికి ఎంతోమంది వస్తావున్నారు. రాళ్ళుగా మారుతా వున్నారే గానీ... నీ మాదిరి చక్కగా సమాధానం చెప్పినవారు ఎవరూ లేరు. చెప్పు... నీకేం కావాల్నో" అనింది. అప్పుడా పిల్లోడు జరిగిందంతా చెప్పి "మా అమ్మానాన్నలు ఎక్కడున్నారు. వాళ్ళని మమ్మల్ని కలుపు" అన్నాడు.

సరే అని పక్షి ముందు వాళ్ళ చెల్లెలిని అక్కడికి పిలుచుకోనొచ్చి ఇద్దరినీ బంగారు రథంపై కూచోబెట్టుకొని వాళ్ళమ్మ దగ్గరికి తీసుకోని పోయింది. జరిగిందంతా తెలుసుకున్న వాళ్ళమ్మ పిల్లలిద్దరినీ దగ్గరికి తీసుకొని ముద్దుల మీద ముద్దులు పెడుతా కళ్ళనీళ్ళు పెట్టుకోనింది. ఆ తరువాత అందరూ రథమెక్కి యువరాజు దగ్గరికి చేరుకున్నారు. పెళ్ళాన్ని చూడగానే రాజు చానా సంబరపన్నాడు. పక్కనున్న ఇద్దరు పిల్లలూ తమ పిల్లలే అని తెలుసుకొని ఆనందంతో అందరినీ దగ్గరికి తీసుకున్నాడు.

జరిగిందంతా తెలుసుకోని భటులని పిలిచి "పోండి... పోయి యువరాణి అక్కలిద్దరినీ పట్టుకొని గుండు కొట్టించి, సున్నం బొట్లు పెట్టి, ఊరకుక్కల మీద వూరంతా వూరేగించి వురెయ్యండి" అని చెప్పినాడు. దానికి యువరాణి అడ్డంపడి "వద్దు రాజా... ఏది ఏమయినా వాళ్ళిద్దరూ నాతోపాటు రక్తం పంచుకొని పుట్టినోళ్ళు. వాళ్ళ బాధ నాకూ బాధే. ఈ ఒక్కసారికి వదిలేయండి" అనింది. చెల్లెలి మంచితనం తెలుసుకొని అక్కలిద్దరూ కళ్ళనీళ్ళు పెట్టుకొన్నారు. పరుగు పరుగున వచ్చి ఆమె కాళ్ళమీద పన్నారు. ఆమె వాళ్ళని పైకి లేపి 'జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటినుండీ అందరం కలిసిమెలసి వుందాం హాయిగా" అనింది.

రాజు తన పెళ్ళాం పిల్లలు తిరిగి వచ్చినందుకు సంతోషంతో వూరువూరంతా విందు భోజనాలు పెట్టించినాడు. వచ్చిన జనాలంతా "అందరూ చల్లగా వుండి తమను చల్లగా పాలించాలని" దీవించినారు.

- రచయిత సెల్ : 9441032212

■ **సృజన**

జనం కోసం జానపదం-యక్షగానం

తెలంగాణ పల్లెల్లో సుపరిచిత కళారూపం యక్షగానం. ఔత్సాహిక యక్షగాన కళాకారులను పల్లెల్లో బాగోతగాళ్ళు అని పిలిచెటివారు. వందల సంవత్సరాలుగా చిందు కళాకారులు యక్షగానామృతాన్ని వినోదంగా ప్రజలకు అందిస్తూనే, యక్షగాన కళను నమ్ముకొని జీవించేవారు. సినిమా రంగ ప్రవేశం చేయడంతో క్రమేణా యక్షగాన వైభవం వెనకపట్టు పట్టడం ప్రారంభమైంది. ప్రపంచీకరణ పల్లెల్ని ఛిద్రం చేయడంతో, ప్రజల పోషణలో తన మనుగడ సాగించిన యక్షగానం, ఆదరించే వారికోసం ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజానాట్యమండలి మొదటి రాష్ట్ర మహాసభలు హైదరాబాదులోని రవీంద్రభారతిలో 2014 ఆక్టోబర్ 27, 28, 29 తేదీలలో జరిగినప్పుడు 'యక్షగానం' చర్చకు వచ్చింది. మహాసభల వేదికపై "జనం కోసం జానపదం" పేరుతో మూడురోజులు జానపద ఉత్సవాలు జరిగాయి. జానపద కళారూపాలు పట్టణ ప్రజలకు

కనువిందు చేయడమేగాక, ఆలోచింపచేసాయి. "శూద్రయుద్ధం యక్షగానం" చర్చకు వేదికయ్యింది.

మనుధర్మం ఆదర్శమని, మనుధర్మాన్ని కాపాడుతూనే కులవ్యవస్థను చెక్కుచెదరనీయుకుండా కాపాడేదే బ్రాహ్మణిజం అని, భారత రాజ్యాంగం అమలు కాకుండా మను ధర్మ రాజ్యాంగం అమలవుతుందని, మనషులంతా సమానమేనని సబ్బండ కులాలు (శూద్రులు) చేసే చైతన్య పూరిత తిరుగుబాటే ఈ యక్షగాన సారాంశం.

మొదట 'మను' పాత్ర ప్రవేశించి– "మూడువేల సంవత్సరాల పూర్వం భారతదేశంలో వర్ణవ్యవస్థను ప్రవేశపెట్టాను, బ్రహ్మదేవుని తలలో నుండి బ్రాహ్మణులు, భుజములలో నుండి క్షత్రియులు, నాభి నుండి వైశ్యులు, కాళ్ళ నుండి శూద్రులు పుట్టారని కట్టు కథను పుట్టించి, శూద్రులతో సేవలు చేయించుకుంటూ, రాజుపై ప్రజలు తిరుగుబాటు చేయకుండా కర్మ సిద్ధాంతాన్ని పుట్టించాను, కర్మసిద్ధాంత ప్రచార బాధ్యతలు బ్రాహ్మణులకు యిచ్చాను. నేను పుట్టించిన కట్టు కథ "వర్ణాశ్రమ ధర్మం" ఏ విధంగా ఉందో చూసి పోదామని వచ్చాను" అని తనను తాను పరిచేయం చేసుకుంటాడు 'మను' పాత్రధారి.

రెండవ పాత్ర 'బ్రాహ్మణ' పాత్రధారి ప్రవేశించి మను పాత్రధారికి సాష్టాంగ నమస్కారం చేసి– "వర్ణా శ్రమధర్మాన్ని చెక్కు చెదరకుండా కాపాడుతున్నాను. శూద్ర వర్ణంలో పుట్టి రకరకాల వృత్తులు చేసుకునే వారికి రకరకాల కులాల పేర్లు పెట్టాను. కులం కట్టుబాట్లు పుట్టించి, ఎక్కువ తక్కువ భేదాలు కల్పించి, ఒక కులం మరొక కులంతో కూడకుండా, మూఢనమ్మకాలు పుట్టించాను. ఎవరు ఎంత గొప్పవారైనా కులం మారకుండా కట్టుదిట్టమైన కట్టు బాట్లు పెట్టాను. 'మను' నాలుగు వర్ణాలతో వర్ణాశ్రమ ధర్మాన్ని సృష్టిస్తే అదనంగా 'పంచములను' సృష్టించిన ఘనత బ్రాహ్మణిజానిదే. ఈ దేశంలో ఎంత ఉన్నత చదువులు చదివినా, విజ్ఞానం ఎంత ఎదిగినా కులం కట్టుబాట్లు అమలు చేస్తుంది బ్రాహ్మణిజమే. మనుధర్మానికి ఎదురులేదు, బ్రాహ్మణిజానికి తిరుగులేదు" అని చెబుతాడు.

మూడవ పాత్ర పరిపాలకులకు ప్రతినిధిగా క్షత్రియుడు. క్షత్రియ పాత్ర ప్రవేశించి "మను ధర్మాన్ని తూచ తప్పకుండా బ్రాహ్మణిజం ఆశీస్సులతో అమలుపరుస్తూ, జనం చేత జేజేలు అందుకుంటున్నాను. కుల కట్టుబాట్లు తప్పినవారికి, మనుధర్మాన్ని వ్యతిరేకించే వారికి మరణదండనలు విధిస్తూ పరిపాలకునిగా ఘనతకెక్కాను" అంటాడు.

నాలుగో పాత్ర "వైశ్య" ప్రవేశించి మనుధర్మం, బ్రాహ్మణిజం, కర్మ సిద్ధాంతం బోధనలతో ఇత్తుకుఇత్తు మిత్తికిమిత్తిలతో కుంచాలతో ప్రారంభమయి రూపాయలకు ఎదిగి, డాలర్ల స్థాయిలో వ్యాపారం వుందని, ఈ మధ్య కాలంలో పరిపాలనలో కూడా ప్రవేశిస్తున్నాను" అని తనను తాను పరిచయం చేసుకుని చెబుతాడు.

ఆరుగురు సబ్బండ కులాల ప్రతినిధులుగా శూద్ర పాత్రలలో ఒకేసారి ప్రవేశించి, బ్రాహ్మణిజం అన్యాయం, మనువాదం దుర్మార్గం అని, ప్రపంచంలో ఎక్కడ లేని కులం భారతదేశంలో మాత్రమే వుందని, ఇది 'మను' కుట్ర అని, బ్రాహ్మణిజం అణచివేత అని, దేశంలో మనుషులంతా సమానమని భారత రాజ్యాంగం అంటుంది. మనువాదం సమానం కాదు అంటుంది. ఈ వాదన రాజ్యాంగ వ్యతిరేకమని, సమనత్వాన్ని వ్యతిరేకించేవారంతా మనువాదుల వారసులని నిలదీస్తారు. దీనితో మను, బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్య పాత్రలకు, సబ్బండ కులాల ప్రతినిధులైన శూద్ర పాత్రలకు సంవాదం జరుగుతుంది. జవాబు చెప్పలేని పై వర్ణాల వారు పారిపోతారు. మనుషులంతా సమానమేననే గానంతో మంగళహరతి పాటతో యక్షగానం ముగుస్తుంది.

పాత కళారూపం యక్షగానం. వస్తువు కొత్తది. ఈ అంశంతో 'యక్షగానం' 40 నిమిషాల పాటు ప్రదర్శించారు. ప్రదర్శించిన కళాకారుల సమర్థత కంటే ప్రేక్షకులు యక్షగానంలోని విషయానికే ప్రాధాన్యతనిచ్చారు. కులం మూలాలు, పుట్టుక–పరిణామం, యక్షగానంలో చెప్పిన తీరు బాగుందన్నారు. ప్రముఖ వాగ్గేయకారుడు యశ్‌పాల్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఈ యక్షగానం ప్రతిపల్లెకు వెళ్లాలన్నారు. ప్రేక్షకులలో అత్యధిక మంది బాగుందన్నారు. అతి కొద్దిమంది మాత్రమే కులాల మధ్య కొట్లాటలా వుందన్నారు. ఇక్కడ గమనించ వలసిన విషయం ఒకటి వుంది. అది ఏమిటంటే– వర్ణాశ్రమ సిద్ధాంతం ఏర్పడినప్పుడు వచ్చిన బ్రాహ్మణ, వైశ్యవర్ణాలు, కులం బలపడడంతో నేటి కుల వ్యవస్థలో మనం కులం అని అనుకుంటున్నాము. యక్షగానంలో, మనుధర్మశాస్త్రం పేరుతో ఏర్పడిన వర్ణవ్యవస్థతో సబ్బండ కులాల ప్రతినిధులైన శూద్రులు పోరాడారు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజానాట్యమండలికి ప్రత్యామ్నాయం సృష్టించడం కొత్తేమి కాదు. ప్రజానాట్యమండలి పుట్టుకలోనే ప్రత్యామ్నాయ కళ వుంది. వర్ణవ్యవస్థను, కర్మ సిద్ధాంతాన్ని, ఈ రెండింటిని బలపర్చేదే మనువాద బ్రాహ్మణిజమని చెప్పడంతో "శూద్రయుద్ధం యక్షగానం" ప్రేక్షకుల అభినందనలు అందుకుంది. విమర్శలు స్వీకరించింది.

– సాంబరాజు యాదగిరి, 83338 11631

నెమలీక

మనశ్శాంతి

రాజుగారికి ఉన్నట్టుండి ఒకరోజు 'ఎవరు నిజమైన ప్రశాంతతో ఉంటున్నారు? అన్న సందేహ: కలిగింది. దర్బారులో మంత్రిని, సామంతులను, పండితులను అడిగాడు. కానీ అందుకు తగిన సమాధానం లభించలేదు. మంత్రి అనేక ఉదాహరణలు చెప్పినా రాజుగారికి నచ్చలేదు. తానే సమాధానం కనుక్కోవాలని నిర్ణయించుకున్నాడు.

ఒకరోజు రాజు వేటకి వెళ్ళాడు. కొందరు సైనికులతో పాటు అలా అడవిలో తిరుగుతూ వేట కొనసాగించాడు. అలా తిరుగుతూండగా రాజుకు దూరం నుంచి ఎవరో పాడుతున్న రాగం వినిపించింది. అడవిలో పాటలు పాడుతూ ఎవరు తిరుగుతున్నారని ఆ రాగం వినిపించేవైపుగా రాజు ఒక్కడే వెళ్ళాడు. ఒక నడివయసు వ్యక్తి కొమ్మలు కొడుతూ కనిపించాడు. రాజు మారువేశంలో వచ్చాడు. కనుక గుర్తించక తనపాటికి తాను పాడుతూనే ఉన్నాడు. రాజుకు ఆశ్చర్యమేసి అతని దగ్గరికి వెళ్ళాడు. "నువ్వెంతో ఆనందంగా ఉన్నావు. ఇదెలా సాధ్యం? ఏ దిగులూ విచారమూ లేదా? " అని అడిగాడు.

ఆ వ్యక్తి నవ్వుతూ "అవును నిజమే! నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ రాజ్యపు రాజుగారికంటే కూడా సంతోషంగా ఆనందంగా ఉన్నాను" అన్నాడు.

"ఇదెలా సాధ్యం? రాజుగారి కంటే నీ దగ్గర ఎక్కువ ఏముంది?" అని ఆశ్చర్యంగా అడిగాడు రాజు.

అతను "రాజుగారిలా ధనరాసులు, మంది మార్బలం లేదు. కాని నాకు ప్రకృతి సంపద ఉంది. ఈ అడవి... ఆహారాన్నిస్తుంది. వంటచెరకూ ఇస్తుంది. ఈ కొండలు, నీలాకాశం ఎంతో మనశ్శాంతినిస్తున్నాయి. ఆహారం, నీరు, ప్రశాంతత పొందుతున్నాను. ప్రకృతి నన్ను కన్నబిడ్డలా చూసుకుంటోంది. మరి నాకంటే ఆనందంగా ఉండేవారు, ధనికులు ఎవరైనా ఉంటారా?" అన్నాడు. నిజమైన ఆనందం మనశ్శాంతిలోనే ఉందని రాజు తెలుసుకున్నాడు.



ఖాళీలను పూర్తి చేయండి

ఇక్కడున్న చక్రాల్లో కొన్ని అంకెలు, మరికొన్ని ఖాళీలు ఉన్నాయి. ఇవన్నీ 12వ ఎక్కానికి సంబంధించినవే. పన్నెండో ఎక్కం చదువుకుంటూ ఖాళీలను పూర్తి చేయండి.



కవలలేరి?

ఇక్కడ చాలామంది పిల్లలు అటూ ఇటూ పరుగెడుతున్నారు. వాళ్లలో ఇద్దరు కవలలున్నారు. వాళ్ల ఎవరో గుర్తుపట్టి సున్నా చుట్టండి.

మూడు కోతులు

ఈ బుల్లి వేటగాడు వేటాడ్డానికని అడవికి బయల్దేరాడు. దారిలో మూడు కోతులు కనిపించి మాయమయ్యాయి. అవి ఎక్కడ దాక్కున్నాయో మీకేమైనా కనిపించాయా?



దారెటు?

బంటికి పాముంటే చాలా భయం. కానీ అరటిపండు కావాలంట. ఏ దారిలో వెళ్తే పామును దగ్గరికి వెళ్లకుండా అరటిపండు దగ్గరికెళ్లి తినొచ్చో చెప్పండి.

చుక్కల్లో దాగున్న దెవరో

రంగులతో అందంగా

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్ధసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

రైతులిక కోలుకోలేరు. వ్యవసాయం మీద ఆశ వదులుకున్నారు. ఈ ప్రకృతి శాపమే పరిశ్రమలకు లాభించింది. ఇప్పుడవి ఇరవై నాలుగ్గంటలూ పని చెయ్యగలిగినంత మంది కూలీలు వచ్చిపడుతున్నారు. 1800తో పోలిస్తే యూరప్ జనాభా నలభై శాతం పెరిగింది. వీళ్లందరికీ పారిశ్రామిక ఉత్పత్తుల అవసరం ఉంటుంది. అవకాశం దొరకినప్పుడే లాభాలు మూటగట్టుకోవాలి. ఇదివరలో డిమాండ్‌ను బట్టి ఉత్పత్తి జరిగేది. ఇప్పుడు ఉత్పత్తి వ్యయం తగ్గటం వల్ల లాభాలే సర్వస్వమనుకున్న ఫ్యాక్టరీల యజమానులు, వినియోగదారుల మీద వస్తువులతో దాడి చేశారు. ఒకవేళ, స్థానికంగా తమ ఉత్పత్తులకు డిమాండ్ లేదనుకుంటే, కొత్తగా వచ్చిన రైళ్ల, స్టీమ్ షిప్పులలో దూర ప్రాంతాలకు తరలించి అమ్మారు. రహస్యం తెలిసింది. వ్యాపారాభివృద్ధికి ఆకాశమే హద్దు. ముఖ్యంగా, అత్యంత పారిశ్రామికీకరణ చెందిన దేశంగా, ఇంగ్లండులో ఈ మనస్తత్వం ఫ్యాక్టరీ యజమానులకు బాగా పాకింది. ఒకప్పుడు 'నాకేది అవసరం?' అని ప్రశ్నించుకుని ఏదైనా కొనుగోలు చేసేవారు. ఇప్పుడు 'నా కోరిక ఎలా తీరుతుంది?' అని కలలుగంటున్నారు. అయితే, ఈ రెండు ప్రశ్నలు అడిగేవాళ్ల మధ్య ఎవరూ పూరించలేనంత అంతరం వుంది.

వ్యాపారంతోపాటు ఉద్యోగాలు పెరిగిన మాట నిజమే. కాని పెరిగిన జనాభాకు అవి సరిపోలేదు. పైగా ఈ ఉద్యోగాలు చేసేంది యంత్రీకరణ వల్ల వృత్తులు కోల్పోయిన వాళ్లూ, వ్యవసాయం లాభసాటిగా లేక నగరాలకు తరలివచ్చిన కర్షకులూ కాదు. ఫ్యాక్టరీ యజమానులు మొదట మహిళల్నీ, చిన్న పిల్లల్నీ కూలీకి పెట్టుకున్నారు. మగవాళ్లకిచ్చే కూలీతో పోల్చితే వీళ్లకిచ్చేది చాలా తక్కువ. ఎన్ని కష్టాలున్నా, వృత్తులలో, వ్యవసాయంలో ఒక భద్రత వుండేది. ఫ్యాక్టరీ ఉద్యోగాలలో అది లేదు. ఎప్పుడు ఉద్యోగంలోంచి తొలగిస్తారోనని ప్రతి రోజూ భయమే. ఈ కుటుంబాలన్నీ ఇదివరలో ఒకే యజమాని దగ్గరో, ఒకే వృత్తిలోనో తరతరాలుగా కొనసాగాయి. సుఖపడ్డారని కాదుగాని వాళ్ల తమ చిన్న సమాజంలో ఒక భాగమనే తృప్తి వుండేది. కాని ఇక్కడ, ఫ్యాక్టరీలలో తమ మీద అజమాయిషీకి ఒక ఫోర్‌మాన్ ఉంటాడు. కొత్తమనిషి. అతడితో తమకేమీ పరిచయముండదు. ఆ ఫోర్‌మాన్ యజమానిని ఎలా సంతోషపెట్టాలనే చూస్తాడు తప్ప తమ బాగోగులు పట్టించుకోడు. గ్రామీణ వాతావరణంతో పోల్చితే, ఫ్యాక్టరీల్లో ప్రతి క్షణం భయమే. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో, ఎప్పుడు ప్రాణం పోతుందో తెలియదు. రోజుకు 12 నుండి 18 గంటల చొప్పున, వారానికి ఆరున్నర రోజులు పనిచేసిన కార్మికులు పనికోసమే బతికారు. బతకటం కోసమే పనిచేశారు.

వీళ్లంతా దురదృష్టవంతులనుకుంటే, ఈ 'సుఖానికి' కూడా దూరమైన నిరుద్యోగులు మరెందరో! వందలు, వేలు కాదు.. లక్షల్లోనే వున్నారు. కాని వాళ్లంతా ఎవరికీ కానరాని, మనుషులు. వాళ్ల గొంతు ఎవరికీ వినిపించదు. నిరక్షరాస్యులు. అడగలేరు. వాళ్లను సమీకరించగల నాయకుడు లేడు. ఎవరికివాళ్లుగా శక్తిహీనులు. దర్జీలు, వడ్రంగులు, ప్రింటర్ల లాంటి వారి పరిస్థితి కాస్త మెరుగ్గా వుంది. మేధావులకు ఈ మనుషులు తెలియదు గాని నిరుద్యోగులు చాలామంది ఆకలికి మాడుతున్నారని తెలుసు.

ఈ వృత్తి పనివాళ్ల, మేధావులు, రాత్రుళ్ల కాఫీహౌసులలో, మద్యశాలల్లో కూర్చుని 'సమాజం ఎలా మారాలి?' అని సుదీర్ఘంగా చర్చించారు.

రవాణా సౌకర్యాల వల్ల, వాణిజ్యమే కాదు, సమాచార వ్యవస్థ కూడా విస్తరించింది. యూరప్‌లో అక్షరాస్యత 50 శాతానికి మించలేదుగాని అందర్లోనూ కొత్త విషయాలు తెలుసుకోవాలనే తపన పెరిగింది. పుస్తకాలకు దేశ సరిహద్దులను దాటి అంతర్జాతీయ పాఠకులు పెరిగారు. ధనికులనూ, నిరుపేదలనూ అత్యంత వాస్తవికంగా చిత్రించిన బాల్జాక్, విక్టర్ హ్యూగో, డికెన్స్ లాంటి రచయితలు తమ సార్వజనీనమైన నవలలతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నారు. ఇదివరకు కేవలం స్థానిక రచయితల గురించి మాత్రమే మాట్లాడుకున్న మేధావులు ఇప్పుడీ అంతర్జాతీయ రచయితలను గురించి చర్చించారు.

రవాణాతోపాటు వార్తాపత్రికలు గ్రామీణులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. స్థానిక ప్రభువుల సెన్సార్లను దాటి అవి పాఠకులకు అన్నిరకాల వార్తలనూ చేరవేశాయి. అత్యంత క్రూరమైన నిరంకుశపాలన కొనసాగుతున్న రష్యాలో కూడా (అక్కడి చక్రవర్తి జార్ నికొలస్ I పన్నెండు సెన్సార్‌షిప్ ఏజెన్సీలను ఏర్పాటు చేశాడు) అధికారుల కళ్లుగప్పి పత్రికలు సామాన్య పాఠకుడికి చేరాయి. మార్క్స్ మిత్రులు పావెల్ అన్నెకోవ్ చెప్పినట్టుగా 'ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే అందుబాటులో వున్న పత్రికలు ఇప్పుడు అందరి ఇళ్లకూ చేరుతున్నాయి.'

ఈ నూతన సమాచార వ్యవస్థలో అన్నింటికన్నా ప్రమాదకరమైన అంశం -ట్రావెలింగ్ సేల్స్‌మేన్- ఊళ్ల తిరిగి వస్తువులమ్ముకునే వ్యాపారస్తులు -. వీళ్ల తమ బుర్రల్లో, మనసుల్లో నాటుకున్న విప్లవ బీజాలను తాము తిరిగిన చోటల్లా నాటారు. విద్యాభ్యాసం కోసం ఇతర నగరాలు, దేశాలకు వెళ్లిన వాళ్లు కొత్త భావజాలాన్ని వంటపట్టించుకున్నారు. పువ్వుల మధ్య పరపరాగ సంపర్కంలా సాగిన, ఈ ప్రక్రియ ఫ్రెంచి, అమెరికన్ ప్రజాస్వామ్య భావనల వ్యాప్తికి దోహదం చేసింది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోనూ ఇటలీలోని మిలాన్ నగరంలో కూడా కొత్త చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని వెన్నంటే వుంటుంది సోషలిజం, కమ్యూనిజం. ఇవిమాత్రమే సమసమాజాన్ని సాధించటానికి ఛోదకశక్తులన్న నమ్మకం బలపడింది. ముఖ్యంగా, పేదలకు, అన్నార్తులకు, పీడితులకు ఇదే ఆశాకిరణం. స్వదేశాలలో ఉద్యమాలు చేసి, బహిష్కృతులై ఇతర దేశాలకు శరణార్థులుగా వచ్చిన నాయకులు ఈ భావాలను బలంగా ప్రచారం చేశారు.

అప్పటికి యూరప్‌లో నిరసన ఉద్యమాలు అంతగా పుంజుకోలేదు. 'పారిశ్రామిక వ్యవస్థ' అనబడే భూతాన్ని ఎలా ఎదుర్కోవాలో ఎవరికీ తెలియదు. కాకపోతే క్రితం సంవత్సరం జరిగిన సిలేషియన్ కార్మికుల ఉద్యమం నిరసనలకు ఊతమిచ్చింది. ('కార్మిక ఉద్యమానికి ఇదే నాంది' అన్నాడు ఎంగెల్స్) 1845లో స్విట్జర్లాండ్‌లోని లూసెర్న్‌లో జరిగిన మత రాజకీయ ఘర్షణల్లో వందమంది హతులయ్యారు. సామాజిక సంస్కరణల కోసం ఉద్యమించిన వారికి ఇవి చెకుముకి రవ్వల్లా కనిపించాయి.

యూరప్‌లోని అన్ని దేశాల ప్రభువులు కూడా ఈ పరిణామాలను గమనిస్తూనే వున్నారు. ఇదివరలో, ఇతర రాజ్యాలతో మాత్రమే యుద్ధాలు చేశారు. కాని ఇప్పుడందరూ 'మానవ హక్కులు' కోసం యుద్ధం చేస్తామంటున్నారు. అమెరికా, ఫ్రెంచి విప్లవాల తర్వాత ఈ ధోరణి బాగా పెరిగింది. సాటి ప్రభువులే కాదు. తమ ఆస్థానాలలోని అరిస్టోక్రాట్లు, బూర్జువా మేధావులు, చిన్న వ్యాపారస్తులు కూడా యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

యూరప్ చరిత్రలో ఇంతవరకు ఇలాంటి పరిణామాలు జరగలేదు. శతాబ్దాలుగా సమాజ స్వరూపం పెద్దగా మారలేదు. రాజాజ్ఞలనెవరూ ఉల్లంఘించటానికి ప్రయత్నించలేదు. సమాజంలోని ప్రతివర్గం వాళ్లూ, తమ పైవర్గం వాళ్ల ఆధిపత్యాన్ని సహజంగా అంగీకరించారు. కాని ఇప్పుడా పరిస్థితి మారింది. అయితే పాతవ్యవస్థను కాదని వచ్చిన కొత్తవ్యవస్థ ఎలా ఉండబోతోంది? ఆ విషయం ఊహించటం అంత కష్టమేమీ కాదు. యూరప్

భవిష్యత్తు ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలంటే ఇంగ్లీష్ ఛానెల్ దాటాలి. అక్కడ ఎంగెల్స్ వున్నాడు. 1845లో తన సహచరుడు కార్ల్‌మార్క్స్‌ను కూడా పిలిపించుకున్నాడు.

లండన్, 1845

ఇంగ్లండు వెళ్లటానికి ముందే మార్క్స్, ఎంగెల్స్, ఈ 'సైద్ధాంతిక చెత్త' గురించి ఒక అవగాహనకు వచ్చారు. సిద్ధాంతాలు, అభిప్రాయాలు అర్థవంతంగా వుండాలంటే – మత, రాజకీయ, ఆర్థిక విషయాలేవైనా – వాస్తవ, భౌతిక పరిస్థితుల నుండి రూపుదిద్దుకున్నవై ఉండాలి. వాస్తవ పరిస్థితుల గురించి చర్చించకూడదు, ప్రచురించకూడదు అని ప్రభుత్వం నిషేధం విధించటంతో, జర్మన్ మేధావులు తమ తాత్వికతకు మహోన్నత ఆశయాలు ఆపాదించి, ఆకాశవీధుల్లో విహరించారు. చివరికి సోషలిస్టులు కూడా 'మానవతా వాదం', 'బాధ, దుఃఖం' లాంటి మాటల చాటున దాక్కున్నారు. నిజానికి వాళ్లు చెప్పదలచుకున్నది 'మనిషి, ఆకలి,' గురించి. భౌతిక విషయాల గురించి చర్చించినప్పుడు వాటిని కప్పుతున్న సైద్ధాంతిక ముసుగును తొలగించవలసిన అవసరం వుందని వాదించాడు మార్క్స్. తన పదకొండు అంశాల Theses on Feuerbach లో మార్క్స్ ఈ విషయాన్ని కుండబద్దలుకొట్టినట్టు చెప్పారు:

'తత్వవేత్తలు ఈ లోకం గురించి వ్యాఖ్యానించారు. కాని దాన్ని మార్చటం ముఖ్యం.' విస్పష్టమైన ఈ అవగాహనతో కార్యాచరణకు పిలుపునిచ్చిన మార్క్స్, తను రాయబోయే పుస్తకానికి వచ్చిన 1500 ఫ్రాంకుల అడ్వాన్సుతో (ఇంకా రచన ప్రారంభమే కాలేదు) ఎంగెల్స్‌తో కలసి ఇంగ్లండుకు ప్రయాణమయ్యాడు.

కార్ల్ దూరంగా వున్న సమయంలో లెంచెనూ, పసిపిల్లనూ తీసుకుని ట్రీయర్‌కు వెళ్లాలనుకుంది జెన్నీ. అప్పటికామె ఆరు నెలల గర్భవతి. ఆ పరిస్థితిలో ప్రయాణం చెయ్యటం కష్టమే. కాని ఇంటివద్ద తల్లి ఎడ్గార్‌తో గొడవపడుతున్నది. సంవత్సరాలపాటు వాయిదావేసి, ఎడ్గార్ లా పరీక్షలైతే రాశాడుగాని ఉద్యోగ ప్రయత్నాలేమీ చెయ్యటం లేదు. కొలోన్‌లో చదువుకుంటున్నప్పుడు రాడికల్స్‌తో తిరిగి తల్లి పంపిన డబ్బులన్నీ నీళ్లలాగా ఖర్చుపెట్టాడు. 'విప్లవం కోసం, పీడిత మానవాళి విముక్తి కోసం' ఈ మాత్రం త్యాగం చెయ్యాలన్నాడు. కాని, నిజానికా డబ్బులన్నీ జల్సాలతో తగలేశాడు. చిన్నప్పుడు జెన్నీ అతణ్ణి ఎంతో గారబం చేసింది. కాని ఇప్పుడే కొరకరాని కొయ్యతో ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఈ విషయమే మార్క్స్‌తో చెప్పింది. ఎడ్గార్ బ్రసెల్స్‌కు రావాలనుకుంటున్నాడు. కనీసం అలాగైనా తన తల్లి తలనొప్పి కొంత తగ్గుతుంది. ఆ నమ్మకంతో తను ప్రష్యాకు ప్రయాణమైంది. మార్క్స్, ఎంగెల్స్‌లు ఇంగ్లండుకు చేరుకుని ఆరువారాల పాటు మాంచెస్టర్‌లో గడిపారు.

జౌళి ఫ్యాక్టరీలలో సుమారు అయిదు లక్షల మంది పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమకు కేంద్రం మాంచెస్టర్. సామాజిక శాస్త్రజ్ఞుడికి, పారిశ్రామికీకరణ పరిణామాలు అధ్యయనం చెయ్యటానికి ఇంతకన్నా అనువైన ప్రయోగశాల మరొకటి వుండదు. వీళ్లు అక్కడికి చేరేనాటికే, ఒకప్పుడు కుటీరపరిశ్రమగా వున్నది కాస్తా, ఫ్యాక్టరీవ్యవస్థగా మారిపోయింది. ఒక్కో యజమాని వద్ద కొంతమంది నేతగాళ్లు పనిచేసేవాళ్లు. అతడే వాళ్ల బాగోగులు చూడటం ఆనవాయితీ. కాని ఫ్యాక్టరీలలో అనామకమైన, అపరిచితులైన యజమానుల వద్ద పనిచెయ్యాలి. పని ముగిశాక కూలీ పంచటం తప్ప, ఈ యజమానులు కార్మికుల గురించి పట్టించుకోరు. యజమాని ఏకైక లక్ష్యం వీలైనంత లాభం ఆర్జించటమే. ఫ్యాక్టరీ వ్యవస్థలో మనిషి మనిషి కాడు. అతడు యంత్రంలోని ఒక భాగం మాత్రమే. నిజానికతడు కుటుంబ పెద్ద కూడా కాదు. ఆడవాళ్లూ, పిల్లలు కూడా ఇక్కడే పనిచేస్తున్నారు.

బ్రిటన్‌లోని అతి పురాతనమైన ప్రభుత్వ గ్రంథాలయం చెతామ్ లైబ్రరీలో కొనసాగింది వీళ్ల అధ్యయనం. లోపల కూర్చోవటం వల్ల వీధుల్లో పొగచూరకుండా తప్పించుకున్నారు. (ఫ్యాక్టరీల పొగతో నగరమంతా నల్లబారిపోతుంది.) బ్రిటిష్ ఆర్థికవేత్తల డేవిడ్ రికార్డో ఆదంస్మిత్, డేవిడ్ హ్యూమ్, సర్ విలియం పెటీల గ్రంథాలను వడపోశారు. (మార్క్స్ రచనల్లో వీళ్ల ప్రస్తావన ఎక్కువగా ఉంటుంది.) రాత్రుళ్లు, మధ్యతరగతివాళ్లు అలవాటుగా వచ్చి కూర్చునే మద్యశాలలలో గడిపారు. మేరీ బర్న్స్‌తో కలసి కూలీపేటలలో తిరిగారు. అక్కడ శనివారం రాత్రుళ్లు మహా హడావిడిగా వుంటుంది. కార్మికులు తమ కూలీ కోసం గంటలకొద్దీ క్యూలలో నిరీక్షిస్తారు. కాసేపటికి వాళ్ల శ్రమ చిల్లర డబ్బుగా మారుతుంది. డబ్బుల కోసం చాచిన చేతులు స్వేచ్ఛను కోరుకుంటాయి. కొన్నిసార్లు, వాళ్ల కూలీని మద్యశాలల్లోనే పంపిణీ చేసేవారు. అంటే ఇక ఇంటికి ఖాళీ చేతుల్తోనే వెళ్తారు. తమ శ్రమ వల్ల, చివరికి కొద్దిపాటి ఆనందమైనా పొందగలుతున్నామనే భ్రమలో వున్నారు వీరంతా. ఎవరైనా, డబ్బులు దాచుకుని, ఇంటికోసం వస్తువులు కొందామని మార్కెట్‌కు వెళ్లినా, ధనవంతులు నాసిరకమని నిరాకరించిన దినుసులు, కుళ్లిన కూరగాయలూ, మాంసం మాత్రమే వుంటాయి. బురదలో, మురికిలోనే అక్కడ అమ్మకాలు కొనసాగుతాయి. కార్మికుల దుర్భర పరిస్థితికి ఇది మరో ఉదాహరణ.

ఇక వీళ్ల నివాసాలలో అడుగుపెట్టటానికే వీలులేదు. 'రెండు గదులు, ఒక సెల్లార్, ఒక మేడగది' వున్న ఇళ్లల్లో ఇరవై మంది ఉంటారు. 120 మందికి ఒక లేవేటరీ, ఒక స్నానాల గది ఉంటాయి. మనుషుల, జంతువుల దుర్గంధంతో ముక్కుపుటాలు పగిలిపోతాయి. ఇళ్లలో గాలాడదు. అందువల్ల ఆ దుర్వాసనలు తగ్గే అవకాశమూ లేదు. అందరూ జౌళి మిల్లుల్లో పనిచేస్తారు. కాటన్ దుస్తుల్లోనే ఉంటారు. ఉన్ని దుసులు ఖరీదెక్కువ. అవి కొనగల సత్తా వాళ్లకు లేదు. అన్నీ రంగు వెలసిన దుస్తులే. ఎవరి దుస్తుల మీదైనా ఇంకా రంగు కనిపిస్తున్నదంటే, అతడు ధనవంతుడన్నమాటే. చలి నుండి కాపాడుకోవటానికి హ్యాట్‌లు పెట్టుకోవటం అవసరం. కాని వాటిని కొనగల స్థోమతు వాళ్లకు లేదు. చేతులకు 'గ్లవ్స్', కాళ్లకు 'మేజోళ్లు' లాంటి మాటలు కూడా వాళ్లకు తెలియవు. బూట్లు ఒక లగ్జరీ. ఆడ, మగ, పిల్లలు అందరూ బోసికాళ్లతోనే నడుస్తారు.

ఆశలడుగంటిన ఈ అధోలోకంలో కుటుంబ జీవితం చిన్నాభిన్నమైపోయింది. పని చెయ్యక తప్పని తల్లులు పసిపిల్లలకు నల్లమందిచ్చి పడుకోబెట్టి ఫ్యాక్టరీలకెళ్లారు. ఆర్థిక భారం తగ్గించుకోవటం కోసం పన్నెండేళ్లు కూడా నిండని ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి పంపేశారు. ఆరేళ్ల పిల్లలు వీధుల్లో ముష్టెత్తుకుంటూ కనిపించారు. ఒకప్పుడు ఇంటి పెద్దలుగా వున్న తండ్రులు ఇప్పుడు, పదిపన్నెండేళ్ల తమ పిల్లలతో కలసి కూలీకెళ్లి క్యూలో నిలబడ్డారు. జబ్బుపడినవాళ్లకు చావే గతి. మందులు కొనే స్థోమత ఎవరికీ లేదు. అనారోగ్యం కన్నా, ప్రమాదాల బారినపడటం కన్నా మరణమే మేలనుకున్నారు – వీళ్లు ఇతర్లకు భారం! అంత్యక్రియల్లో, మరణించినవాళ్లను అదృష్టవంతులు అంటూ పొగడ్తలతో ముంచారు.

జీవిత వాస్తవికతను తెలుసుకోవాలనుకున్న మార్క్స్‌కు అది మాంచెస్టర్‌లో పుష్కలంగా లభించింది. ఇంతవరకూ అతడికి కార్మికుల జీవన పరిస్థితుల గురించి అవగాహన లేదు. ఈ నరక కూపాలు నమ్మలేనినిజాలు. పారిస్‌లో కార్మికులను చూశాడు. వాళ్లతో మాట్లాడాడు. కాని ఈ అనుభవం వేరు. కార్మికులవాడ అంటే మోకాలిలోతు మురికిలో కూరుకుపోవటం – భౌతికంగానూ, మానసికంగానూ ఆ దృశ్యాలు, ఆ శబ్దాలు, ఆ వాసనలు ఎవర్నైనా షాక్ చేస్తాయి. మార్క్స్ ఒక మధ్యతరగతి మేధావి. భార్య అరిస్టోక్రాట్. ఇంతవరకూ సంస్కారవంతులతో చర్చలలో మాత్రమే పాల్గొన్నాడు. ఇప్పుడు ఉన్నపళంగా అనూహ్యమైన మానవ పతనాన్ని ప్రత్యక్షంగా చూశాడు. ఇంతవరకూ 'సిద్ధాంతాలు వద్దు.... భౌతిక వాస్తవికత ముఖ్యం' అన్నప్పుడు అదీ ఓ సిద్ధాంతమే. ఇక ఆ పరిస్థితి మారింది. మాటలు కాదు. చేతలు కావాలి.

సుమారు నలభై అయిదు రోజుల తర్వాత మిత్రులిద్దరూ మాంచెస్టర్ నుండి లండన్ చేరుకున్నారు. పారిశ్రామికీకరణ ప్రభావానికి ఇది మరో పార్శ్వం. 'ఇక్కడి వీధుల్లో నడవటానికి కూడా చోటుండదు' – అయినా అందరూ ఎవరికివారు ఒంటరులమనే అనుకుంటారు' – ఎంగెల్స్. గుంపులో వున్నా ఒకర్నొకరు పట్టించుకోనితనం. మాంచెస్టర్‌లో ధనికులూ, పేదలూ వేర్వేరుగా బతుకుతారు. నగర నిర్మాణమే అలా జరిగింది. పేదరికం ఎలా వుంటుందో తెలియనంత దూరంలో ఉంటాయి ధనికుల విలాస భవనాలు. – అలకాపురికి నకలు ఆ మాంచెస్టర్. కాని లండన్‌లో అలా కాదు. ఇక్కడి వీధుల్లో ధనికుల పక్కనే నడుస్తారు పేదలు. – కాని ఇద్దరూ వేర్వేరు జాతులకు చెందిన జీవుల్లా ఉంటారు. పక్కపక్కనే నడిచినా ఏ సంబంధమూ వుండదు – ఏమైనా ఉంటే – అది ధనికులు నిరుపేదలను దోచుకునే సంబంధమే తప్ప, ధనికులు పేదలను దోపిడీ చేస్తారు. అవకాశం దొరికినప్పుడల్లా పేదలు వున్నవాళ్ల ఇళ్లలో దొంగతనాలు చేస్తారు. దోపిడీకి మారుపేరు పారిశ్రామికీకరణ. దొంగతనం మాత్రం శిక్షార్హమైన నేరం.

(సశేషం)

ప్రతి మనిషికి వస్తువులు లేక విషయాలకు సంబంధించి బాగుంది లేక బాగు లేదని ఒక అభిప్రాయం ఉంటుంది. తిండి, పాటలు, సంగీతం, సినిమా, కథలు, నవలలు, ఆటగాళ్ళు ఆడే తీరు, ఒకరు మాట్లాడే తీరు ఇలా ఎన్నెన్నో విషయాల్లో మనం రోజు అంతా పట్టించుకోక పోయినా అచేతన మస్తిష్కం ద్వారానైనా మంచి చెడ్డలు బేరీజు వేసే ప్రక్రియ నడుస్తూ ఉంటుంది. కొంచెం నిదానంగా ఆలోచిస్తే ఇందులో మనకు సౌందర్యానికి సంబంధించి ఒక అంశం ఉందని తెలుస్తుంది. ఇలా బాగుంది, బాగా లేదు అనుకోవటంలో ఒక అంశం ఆనందమనేది కూడా ఉంటుంది. ఎందుకంటే ఒక మంచి పాట వింటే మనకి ఆనందం కలుగుతుంది. ఒక చక్కటి మొహం కాని దృశ్యం కాని కనబడితే ఒక విధమైన ఆనందం కలుగుతుంది. అంటే సౌందర్యానికి, ఆనందానికి ఏదో ఒక సంబంధం ఉందన్న మాట.

సౌందర్యం

అందుకే కాబోలు అందమే ఆనందమని నుడికారం కూడా వచ్చింది. అయతే ఆనందానికి మూలం అందంలో ఉందని తోలుసుకున్నాక అందానికి మూలం ఎక్కడ అనే ఆలోచన స్వాభావికంగానే వస్తుంది.

దీని గురించి పరిశీలించినప్పుడు మనకు కనిపించేదేమంటే సౌందర్యం మానవుడి వరకు సహజంగా ఉన్న ప్రకృతిలో ఉందని అనిపిస్తుంది. కొండలు, లోయలు, నదులు, సముద్రాలు, మేఘాలు, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, నక్షత్రాలు ఇలా ఎన్నో ఉపాదానాలు ఉన్నాయి ఆలకించి ఆనందించటానికి. ప్రకృతిలో ఉన్న సహజత్వం, తాజాదనమే దీనికి మూల కారణం అనిపిస్తుంది. ప్రకృతిలో తనదంటూ ఒక సహజ దోరణి ఉంది. తనను తాను పాచిని మలిచి, మార్చి కొత్తగా, తాజాగా తయారు చేసుకోవటం. అదే దాని అందానికి మూలం.

ఇక రెండోది, ఏ వస్తువుకైనా ఒక విధమైన నిర్మాణపరమైన సమతూకం, సామంజస్యం లాంటిది. ముక్కు మొహానికి మధ్యలో ఉన్నా రెండు పుటాలు ఒకే రకంగా ఉండటం, కళ్ళు, చెవులు రెండు వైపుల ఒక సమతూకంతో ఉండటం. అంటే జ్యామితీపరంగా సమవిన్యాసంతో కూడుకున్న భాగాలు కలిగి ఉండటం. ఇది సౌందర్యానికి ఇంకో పార్శ్వం.

పువ్వుకి రెమ్మలు ఒక పద్ధతిలో వుంటాయి. ఉదాహరణకు కలవ పువ్వు. ఆ రెమ్మలు విడదీసేస్తే ఆ పువ్వు సౌందర్యమే కాదు, ఆ పువ్వే ఉండదు. రెమ్మలైతే అవే కదా! మరి సౌందర్యం ఎక్కడికి పోయింది? దీనిబట్టి మనకు సౌందర్యం విన్యాసంలో ఉందని తెలుస్తుంది. అందుకే మనం పద్ధతి ప్రకారం చెయ్యటాన్ని బాగుంటుందని అంటాం. ఒక రకమైన స్థిరమైన విన్యాసానికి తోడ్పడేది లయ. ఋతువులు, రాత్రి–పగలు, అలాగే క్రమ శిక్షణ, వ్యాయామం వగైరా. పోలీసు, సైన్యంలో రోజు జరిగే ప్యారేడు కూడా అంతే. వీటిన్నిటికీ ఉన్న సౌందర్యం వాటికి ఉన్న లయబద్ధతే.

నిజం చెప్పాలంటే సౌందర్యం సహజంగా, ప్రకృతిపరంగా వెలియాలి. అప్పుడే అది సౌందర్యం అవుతుంది. అంటే లయ, విన్యాసం, సహజత్వం, తాజాదనం– ఇవి అందానికి ఆయామాలు.

మనిషి తన వరకు వచ్చే సరికి ఈ అందం భావన కారణంగా తాను కూడా అందంగా ఉండాలని, కనబడాలని అనుకుంటాడు. అందుకే మనిషి సమాజంలో సుందరంగా కనబడటానికి ఇన్ని తంటాలు. చాలా కాలం అందంగా ఉండటమేనిది మహిళా వ్యవహారమని అనుకునేవారు. కాని నేటి ప్రపంచంలో అన్ని సరుకుగా మారిన తరువాత మగవారు కూడా అందంగా కనబడటానికి చర్యలు తీసుకోవాలనే ధోరణి బయల్దేరింది. సౌందర్య సాధనాలు ఆడవారే కాక మగవారు కూడా వాడటం ఇప్పుడు పరిపాటి అయింది. ఇక ఈ చక్కగా కనబడాలనే ఆలోచన వచ్చిన తరువాత ప్రకృతిపరంగా ఏమైనా లోపాలున్నాయని భావిస్తే వాటిని కప్పిపుచ్చుకోవటానికి తంటాలు పడుతూ ఉంటారు. ఒకొక్కసారి ఆ లోపాలను కప్పటం సాధ్యపడదు లేక దాచటానికి. పోతే ఇంకా వాటి వైపే ఇతరుల దృష్టి ఆకర్షితం కావటం కాని అనుకున్నదానికి విరుద్ధంగా అందం ఇంకా తగ్గటం కానీ జరుగుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే కొంతమంది అనుకున్నట్టు వారి లోపం లోపంగా కాకుండా ఒక రకమైన సహజత్వం ఇచ్చి ఇంకా ఎక్కువ ఆకర్షణీయంగా చేస్తుంది. మొహం మీద గాయం మచ్చ, కనుబొమ్మలు జ్యామితీపరంగా సమతూకంలో లేకపోవటం వగైరా. నేడు సౌందర్య చికిత్స చేసేవారు కూడా ఈ కోణం నుండి సౌందర్య చికిత్సా పద్ధతిని చూస్తున్నారు. అడిగిందే తరువాయి ప్లాస్టిక్ సర్జరీ చేసేయటంవల్ల మేలు కన్నా కీడు జరగచ్చని ఇప్పుడిప్పుడే జనాలకి వివరించటం కూడా జరుగుతున్నది. అందుకే చక్కగా కనబడుదామనే ఉబలాటంలో తాను సహజంగా ఉంటేనే చూడ సొంపుగా ఉన్నామా లేదా అనేది కూడా చూసుకునే అవసరం ఎంతైనా ఉంది. ఒకే పద్ధతి ఒకరికి లాభించినట్టు ఇంకొకరికి లాభించక పోవచ్చు. ఇలాంటి పద్ధతులన్నీ విన్యాసమనే ఆయామానికే చెందుతాయి. మిగతా లయ, సహజత్వం, తాజాదనం ఆనే కోణాలని పాటిస్తే చాలా వరకు వారి ఉద్దేశాలు నేరవేరుతాయి. తాజాదనానికి శుభ్రత ఆధారం. నిత్యం శుభ్రతపై దృష్టి పెడితే అది కూడా చక్కదనాన్ని ఇనుమడింప చేస్తుంది.

– వేదుల రామకృష్ణ,

■ ఎరుక : మునిమడుగుల రాజారావు

అహంకార ప్రదర్శన అనేక రూపాలు

వారం రోజులుగా సాగుతోన్న తాత్విక చర్చా కార్యక్రమం. ఆ రోజే చివరిది. ప్రేక్షకుల/ శ్రోతల సంఖ్య మిగతా రోజులు కన్నా కాస్త ఎక్కువగానే ఉంది. అలా ఉండటానికి కారణంలేక పోలేదు. వారం రోజులుగా సాగుతోన్న ప్రసంగాలకి- ప్రాక్టికల్ లాంటిది ఒకటి చివరి రోజున ఉంటుందనీ రోజూ మరచిపోకుండా చెబుతూనే ఉన్నారు కాబట్టి.

ఇద్దరు తత్వవేత్తలు, ఒకరిపై ఒకరు పోటిపడి(నట్లుగా) చెబుతూ వస్తున్నారు. తాత్వికాంశాల్ని ఎంత బాగా చెబుతున్నా రంటే- తత్వశాస్త్ర మంటేనే కఠిన మనుకొని దానికి ఆమడ దూరంగా పరుగు తీసిన వారంతా! ఇప్పుడు అదొక తల్లిగారి ఇల్లు లాంటిదనీ, ఆ ఇల్లు చిరునామాని మరచిపోయిన వాళ్లంతా మళ్లీ పుట్టింటికి పయనమయ్యేందుకు సిద్ధమయ్యే విధంగా తత్వశాస్త్ర ఆవశ్యకతని వొలిచి బోధిస్తున్నారు. 'ఆ ఇద్దరిలో' ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అని పోల్చుకునేందుకు ప్రేక్షకులకు అవకాశం దొరకకుండా వారి స్థానాలను సైతం మరీ మరీ మార్చుకుంటూ వారు ప్రసంగాలని వొదులుతున్నారు.

మానవ జన్మ అంతిమ లక్ష్యం 'సత్యాన్ని' తెలుసుకోవడమే అని అన్నారు. అందుకై ప్రధాన అడ్డు కట్టగా ఉన్నటువంటి, నిరోధకంగా ఉన్నటువంటి అహంకారాన్ని తొలగించు కోవాలని అన్నారు. అలాంటి అహంకారాన్ని తొలగించుకోటానికి ఏమేమి చేయాలో అని ఎన్నెన్నో చెప్పారు. జీవన ప్రయాణంలో జరిగే ప్రతీ ఒక చర్యని పక్ష పాతం లేకుండా, తీర్పులు ఇవ్వకుండా కేవలం గమనిస్తూ సాగే ప్రయాణం అహంకారం నుండి పూర్తిగా దూరం కావచ్చు అని అన్నారు. కొందరూ అనుకుంటోన్నట్లుగా 'అహంకారం' అంటే 'గర్వం' మాత్రమే కాదు అనీ, అది వినయం యొక్క చాటింపు కూడా అని అన్నారు. ఒక ప్రత్యేకత చాటింపు ప్రక్రియే అహంకారం అని అన్నారు. అది మంచిదీ కాదూ, చెడ్డదీకాదూ...అది ఉంది! అంతే! అది మనసు నైజం! అని అన్నారు.

కోపంతో ఊగిపోతూ 'నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని బిగ్గరగా అరుస్తూ ఉంటామే... ఆ అరుపుల్లో ధ్వనిస్తోన్నది ఏమిటి? 'నా అంతటి ధైర్యవంతుడే లేడు' అని; 'కోపం వస్తే నా అంతటి చెడ్డవాడే లేడు' అని; నా అంతటి గొప్ప ప్రేమికుడే లేడు' అని; నాకసలు భయపడటమంటే ఏంటో తెలీదనీ; 'నేను దేనికీ భయపడను' అని మాట్లాడుతూ ఉంటాం. ఆ మాటల్లో ధ్వనిస్తోన్నది' ఏమిటి?

ఎంతో వినయ సంపన్నుడననీ అనిపించుకోటానికీ, ఎంతో మానవత్వం కలిగి ఉన్నవాడిననీ అనిపించుకోటానికీ చేతుల్ని కట్టుకుని ఎంతో వినయాన్ని ప్రదర్శిస్తూ ఉంటాం. ఆ ప్రదర్శన ఆవిష్కరిస్తున్నది ఏమిటి? ఒక ఐడెంటిటి కోసం పడే తపన కాదా? ఒక విశిష్టత కోసం పడే ఆరాటం కాదా? ఒక ప్రత్యేకత కోసం పడే తపన కాదా? ఇలాంటి ప్రక్రియల పట్ల ఎరుక కలుగుతోన్న క్రమంలో అహంకారం తొలగిపోతూ ఆవిరైపోవడం ఆరంభమవుతుంది.

ఎన్నెన్నో ఉదాహరణలతో వారిద్దరూ అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఇంతలో వారిపైకి ఒక పాము విసిరివేయ బడింది. వేదికపైని ఆ ఇద్దరు వక్తల్లోని ఒకతను ఎంతగానో భయపడి పోయాడు. అమ్మో! అని బిగ్గరగా అరిచాడు. ఆ వెంటనే వేదిక మీంచి చెంగున కిందకు దూకి, అటు పక్కగా పరుగు తీసాడు.

ఈ యాదృచ్ఛిక సంఘటన సభలో కలకలం రేపింది. ప్రేక్షకుల్లో కొంత కోపాన్ని తెప్పించింది. పాముని విసిరేసిన వాడిని పట్టుకుని కొట్టినంత పని చేసారు కొంత మంది. వేదిక పైనున్న వక్తల పరిస్థితిని చూసి ప్రేక్షకులకు ఎంతో జాలివేసింది. అయినప్పటికీ వేదిక మీంచి ఓ వక్త భయపడి పరుగు తీస్తోంటే! కడుపులోంచి తన్నుకు వచ్చే నవ్వుని ఆపుకోలేక పోయారు. అలలు అలలుగా తన్నుకు వొచ్చే నవ్వుతో కొందరి కళ్లల్లో నీళ్ల సుడులు తిరిగాయి. కొందరైతే కడుపులు పట్టుకుని మరీ మరీ నవ్వుతూనే ఉన్నారు. కొద్దిసేపటికి నవ్వు సద్దుమనిగింది.

వేదిక మించి దూకి పరుగులు తీసిన వ్యక్తి ఇప్పుడు మళ్లీ వేదిక ఎక్కాడు. అతడిని వేదికపై మళ్లీ చూసే సరికి ప్రేక్షకుల్లో ముసిముసిగా నవ్వు మళ్లీ మొదలైంది. అంతలో పాముని విసిరేసిన వ్యక్తి కూడా వేదిక మీదకు వచ్చాడు. అతడి చేతిలో అదే పాము వుంది. అయితే అది నకిలీ పాము.

ఆ ఇద్దరు తత్వవేత్తలు మళ్లీ మాట్లాడటం మొదలు పెట్టారు. మనం బాగా గౌరవిస్తోన్న వ్యక్తులు ఎలాంటి చిన్నతనం పని చేయకుండా ఉండాలని అనుకుంటాం. నవ్వుల పాలయ్యే విధంగా ప్రవర్తించకూడదని అనుకుంటాం. పాము మా పైకి పడగానే మాలో ఒకతను ప్రాణం పోయినా సరే (నేను దేనికీ భయపడను అనే) మాటకి కట్టుబడి ఉండాలని పాముకి భయపడకుండా అక్కడే నిల్చున్నాడు. కాని లోలోపల భయం తాలూకు ప్రక్రియ జరిగిపోతూనే ఉంటుంది. కాని మీ దృష్టిలో ఒక ప్రత్యేకతని, ఒక విశిష్టతని, నిలబెట్టుకోడానికి తనలోని సహజత్వ ప్రవాహ ప్రక్రియని అణచివేస్తూ అలాగే ఉండిపోయాడు. అది కూడా ఒక అహంకార ప్రదర్శనే!

'నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" అని బిగ్గరగా అరుస్తూ ఉంటామే... ఆ అరుపుల్లో ధ్వనిస్తోన్నది ఏమిటి? 'నా అంతటి ధైర్యవంతుడే లేడు' అని.

జీవితం అనిశ్చితమైనది. అది ముందుగానే తయారు చేసుకున్న ప్రణాళికలకు అనుగుణంగానే ఉండిపోవాలన్న సుత్రాల్ని లెక్క చేయదు. అది తనదైన రీతిలో, తనకి నచ్చిన సహజమైన శైలిలోనే ప్రవహించేందుకు ఇష్టపడుతుంది. అందుకనే పాముని మాపై విసిరివేయగానే మాలోని మరొకరు అప్పటికప్పుడు యాదృచ్ఛికంగా, హఠాత్తుగా జరగబోతోన్న సంఘటననీ- ప్రత్యక్షంగా, సహజాతి సహజంగా ఎదుర్కొన్నాడు. సంభవించబోతోన్న ఒక ప్రమాదం నుండి తప్పించుకుని అలా పారిపోవడం కూడా ప్రత్యక్షంగా ఎదుర్కోవడంలో ఒక పద్ధతే! అది ప్రతి జీవి సహజ లక్షణం. కాని, అది మీకు చిన్నతనంగా కనిపిస్తుంది. అతడిని పిరికి మనిషిగా జమ కడతారు.

బాల్యంలో ఏడుపు వస్తే ఏడుస్తారు. నవ్వువస్తే నవ్వుతారు. అవి సహజాతలు. వాటిని బాల్యంలో అణచివేయడం జరగని పని, కుదరని పని. ఎందుకంటే! బాల్యంలో అహంకారం ఇంకా ముదిరిపోయి ఉండదు కాబట్టి. అందుకనే బ్యాలంలో దొరికినంత ఆనందం ఆ తరువాత లభించదు.

- రచయిత సెల్ : 949340130

అంతర్లోకాల ఆవిష్కరణే ఆమె కవిత్వం

జీవితం ఒడిదుడుకులమయమైనా కవితా వ్యాసంగాన్ని ఎన్నడూ వదులుకోని కవయిత్రి గబ్రియేలా మిస్ట్రాల్. చిలీలో ఉదాత్తమయిన సాహితీవేత్తల్లో ఒకరుగా పేరొందారు. ఈమె మొట్ట మొదటి లాటిన్ అమెరికా నోబెల్ కవయిత్రి. అసలు పేరు లుసిల గొడొయ్ అల్బయాగ. సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన అయిదవ మహిళ. కాగా ఇప్పటివరకు కవిత్వానికి నోబెల్ బహుమతి పొందిన ముగ్గురు కవయిత్రులలో ఒకరు కావడం విశేషం.

తండ్రి జురొనిమొ గొడొయ్ విల్లనుయెవ (1856–1911) ఉపాధ్యాయుడు, సంగీత కవిత్వ ప్రేమికుడు, ఫ్రెంచ్ అనర్గళంగా మాట్లాడగలిగే లాటిన్ పండితుడు; తల్లి పెట్రొనిల అల్బయగ రొజస్ (1845–1929) వస్త్రాలు తయారు చేసే దర్జీ, కవిత్వం రాసేది. ఆమెకు అంతకుముందు ఒక నల్ల జాతీయుని భర్త ద్వారా ఒక ఆడపిల్ల ఎమెలిన మొలిన కూడా ఉంది.

పిల్లల పట్ల, సమాజంలోని రకరకాల పీడితుల పట్ల ఆమె ప్రగాఢ కరుణాంతరంగాన్ని తెలియజేస్తాయి. ఆమె కవితలు చాలా వరకూ ప్రార్థనల్లా ఉంటాయని చిలీ రచయిత, మతాచార్యుడు ఫ్రాన్సిస్కొ డొనొసొ వ్యాఖ్యానించారు.

మిస్ట్రాల్ జీవితం మొదటినుండి కష్టాల మయం. తాగుడుకు బానిసైన తండ్రి ఆమె మూడేళ్ల ప్రాయంలో కుటుంబాన్ని వదిలేసాడు. అంతకుముందు తండ్రి మిస్ట్రల్ కోసం ఒక తోటను పెంచాడు. అందులో పూలతోను, పక్షులతోను మాట్లాడుకుంటూ మిస్ట్రాల్ గడిపేది. కవిత్వం పట్ల తపనకు మూలం తన తండ్రే అని ఆమె చెప్పేవారు. గ్రామీణ వాతావరణంలో పేదరికం నడుమ పెరిగారు. అస్థిరమైన, అవ్యవస్థితమైన కుటుంబ జీవితం ఆమెది. అయినా అప్పటి సంప్రదాయక సమాజంలో అత్యంత ప్రగతిశీల భావాలున్న మహిళ మిస్ట్రాల్.

(1898–1901) మధ్య, గ్రామీణ ప్రాథమిక పాఠశాలలో మిస్ట్రాల్ చదువుకుంది. పదహారేళ్లు వచ్చే సరికే, కుటుంబ పోషణకోసం, పల్లెటూర్లో ఉపాధ్యాయ వృత్తిలో చేరాల్సొచ్చింది. అప్పటికే ఆ వృత్తిలో ఉన్న పెద్దక్క ఎమెలిన ప్రభావంతో మిస్ట్రాల్ ఆ వృత్తిలో చేరింది. తన ఉద్విగ్న కవిత్వం మూలంగా, తన ఉపాధ్యాయ జీవనోపాధి దెబ్బతింటుందని భావించి, గాబ్రియెల్ మిస్ట్రాల్ మారు పేరుతో రచనలు చేయడం మంచిదనుకుంది. తనకు అత్యంత ప్రియమైన కవులు; ఇటలీ కవి గబ్రియేలా డి అన్నుంజియొ (1863–1938) నుండి గబ్రియేలా, ఫ్రెంచి కవి ఫ్రెడరిక్ మిస్ట్రాల్ (1830–1914) నుండి మిస్ట్రాల్ తీసుకుని గబ్రియేలా మిస్ట్రాల్‌గా, కేవలం కవిత్వం కోసమే పేరు మార్చుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి స్వీకరించాక, చిలీ స్త్రీల పక్షాన, వారి హక్కులకోసం పోరాడారు. విద్యా వ్యవస్థ వైఫల్యాల మీద అనేక వివాదాస్పద వ్యాసాలు రాశారు. 1906 నుండి 1921 వరకూ అనేక చోట్ల పాఠశాలల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. ఆ క్రమంలోనే పదహారేళ్ల పాబ్లోనెరూడాని టెముకోలో మొదటిసారి కలిసి. అతనికి యూరోపియన్ కవుల్ని పరిచయం చేసింది. ఒకే దేశస్థుడైన నెరూడాతో సత్సంబంధాలుండేవి. నెరూడా ఊరు టెంకోలో ఈమె పాఠశాల నిర్దేశకురాలిగా పని చేసింది. నెరూడా శక్తి సామర్థ్యాల్ని అప్పటికే ఆమె గుర్తించినా, నెరూడా తన రచనల్ని మిస్ట్రాల్‌కు చూపించేందుకు కూడా భయపడేవారు. ఇటీవల సెప్టెంబరులో వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న, ప్రసిద్ధ స్పానిష్ కవి నికొనార్ పారా మిస్ట్రాల్ ఒక సభలో తన కవిత్వం చదువుతున్నపుడు, ఆ వేదికమీదకు గెంతి పారా తన కవిత్వం చదివి వినిపిస్తే, గబ్రియేలా విసుక్కోలేదు. ఆనందపడి, ఆ తరువాత అతన్ని ఎంతగానో ప్రోత్సహించింది.

1906లో పరిచయమైన రోమియో ఉరేటా అనే రైల్వే ఉద్యోగిని అమితంగా మిస్ట్రాల్ ప్రేమించింది. అయితే అతను 1909లో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని జేబులో మిస్ట్రాల్‌కి రాసిన ఉత్తరం మాత్రమే దొరికింది. దాన్నుండి కోలుకోలేక, జీవితాంతం ఆమె అవివాహితగానే ఉండిపోయింది. అది ఆమె రచనా వ్యాసంగాన్ని చాలా ప్రభావితం చేసింది.

1921లో చిలీ సాంటియాగోలో అత్యంత పేరు ప్రతిష్టలున్న మాధ్యమిక బాలికల పాఠశాలకు మిస్ట్రాల్ ప్రధానాధ్యాపకురాలయింది. ఆ పదవి అంత తొందరగా ఆమెను వరించడం చాలా మంది జీర్ణించుకోలేకపోయారు. 1914లో వచ్చిన "మరణకవితలు" లోని ప్రేమ కవితలు, మిస్ట్రాల్‌కు లాటిన్ అమెరికాలో మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆ పుస్తకం గబ్రియూలా మిస్ట్రాల్ పేరుమీద సంతకంతో వెలువడింది. అదే పేరు ఆమెకు స్థిరపడిపోయింది. 1922లో తన ప్రేమికుని మరణాంతర దు:ఖంతో రాసిన 'నైరాశ్యం' రెండవ కవితా సంకలనం వెలువడి, అనేక మన్ననలు పొందింది. క్షమించే దేవుడు, క్రైస్తవ మతం, మరణం అందులో ముఖ్య వస్తువులు. 1924లో రాసి 1945లో విస్తరించిన 'సున్నితం', 1938లో వచ్చిన "విధ్వంసం" మొదలైనవి పిల్లల పట్ల, సమాజంలోని రకరకాల పీడితుల పట్ల ఆమె ప్రగాఢ కరుణాంతరంగాన్ని తెలియజేస్తాయి. ఆమె కవితలు చాలా వరకూ ప్రార్థనల్లా ఉంటాయని చిలీ రచయిత, మతాచార్యుడు ఫ్రాన్సిస్కొ డొనొసొ వ్యాఖ్యానించారు. 1929లో మిస్ట్రాల్ తల్లి మరణించాక, ఆమెకు 'కూలిన చెట్టు' సంకలనాన్ని అంకితమిచ్చారు. ఆమె పూర్తి కవిత్వ సంకలనం 1958లో వచ్చింది.

సాంటియాగోలో చేరిన కొన్నాళ్లకు మిస్ట్రాల్‌ను, తమ ప్రాంతంలో పాఠశాలల్ని, గ్రంథాలయాల్ని సంస్కరించడానికి మెక్సికో ఆహ్వానించింది. ఆ తరువాత కాలంలో రెండు సార్లు 1938, 1954లో మాత్రం. అది కూడా కొద్ది రోజులకోసం చిలీ వెళ్లారు. మెక్సికో నుండి, అమెరికా, యూరప్

వెళ్లారు. 1925-1934 మధ్య ముఖ్యంగా ఫ్రాన్స్, ఇటలీలలో ఉన్నారు, ఆ కాలంలోనే ఏడాదికి కనీసం 50 వ్యాసాలన్నా వివిధ విషయాల మీద రాసి ప్రచురించారు. ఈవిధంగా ఆమె రాసిన వ్యాసాలు దాదాపు 800 వరకూ ఉన్నాయి. మిస్ట్రాల్ స్నేహితుల్లో నాటి ఫ్రెంచ్ ప్రసిద్ధ తత్వవేత్త హెన్రి బెర్గ్సన్ (1859-1941), భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం రెండిటిలోనూ నోబెల్ బహుమతి పొందిన మేరీ క్యూరీ (1867-1934) మరికొందరు ఉన్నారు.

మిస్ట్రాల్ 1930లో న్యూయార్క్ బెర్నార్డ్. వస్సర్ కళాశాలల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేసారు. లాటిన్ అమెరికా సంస్కృతి ప్రకారం, చిలీ ప్రభుత్వం ఆమెకు చిలీ విదేశాంగ శాఖ ఉద్యోగిగా 1933లో నియమించారు. అది దౌత్యాధికారి లాంటి ఉద్యోగం. ఆ తరువాత ఆమె చిలీ ప్రతినిధిగా, బ్రెజిల్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, అమెరికా దేశాలలో గౌరవ దౌత్యవేత్తగా పనిచేసారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో బ్రెజిల్‌లో ఉన్నప్పుడు, ఆస్ట్రేలియాలో పుట్టిన ప్రముఖ రచయిత స్టీఫెన్ జ్విగ్, అతని భార్యతో సన్నిహితులయారు, కానీ వారిద్దరూ ఆత్మహత్య చేసుకోవడం ఆమెను కుంగదీసింది. ఆ విషాదం నుండి కోలుకోకముందే ఆమె పెంచుకున్న కొడుకు (తన మేనల్లుడు జువన్ మిగుయెల్ గొదొయ్) కూడా అక్కడే పదిహేడేళ్లకే ఆత్మహత్య చేసుకున్నాడు.

మిస్ట్రాల్‌కు 1926లో నానాజాతి సమితి జెనీవాలో ఉద్యోగం వచ్చింది. దానితో యూరప్‌లోని అనేక దేశాలు, అమెరికా అంతటా పర్యటించారు. ఆ సందర్భంగా ఆమె చేసిన ఉపన్యాసాలు, రచనలు ఎందరినో ఆకట్టుకున్నాయి. అమెరికన్ దేశాల్లో అనేక అవార్డులూ సన్మానాలు పొందారు. 1936లో స్పెయిన్‌లో అంతర్యుద్ధం మూలంగా, అక్కడినుండి విముక్తి చెంది అమెరికా వలస పోవాలనుకున్న స్పానిష్ వాసుల్నే కాక, ఫ్రాంకో, రిపబ్లికన్లు, నాజీల బారిన పడకుండా యూరప్ యూదులకు సైతం సాయపడ్డారు.

1945లో నోబెల్ బహుమతి రావడం, మిస్ట్రాల్ జీవితంలో ఉదాత్తమైన మలుపు. 1953లో న్యూయార్క్‌లోని చిలీ రాజదూతగా ఐక్య రాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో, స్త్రీల స్థితిగతుల మీద మిస్ట్రాల్ ప్రసంగించారు.

వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు పడ్డా చదవడం ద్వారా, కవిత్వం రచించడం ద్వారా నిరాశా నిస్పృహలకు లోను కాకుండా తనని తాను కాపాడుకున్నారామె. ఒకవిధంగా కవిత్వమే ఆమకు ఆలంబనయింది. ఆమె అంతర్లోకాల ఆవిష్కరణకు కవిత్వం ప్రధాన వాహికయింది. ఈ క్రమాన బాల్యం, ప్రేమ, ప్రకృతి, క్రైస్తవ మత నమ్మకం, మరణం, పునర్జన్మ, ఎక్కువ మిస్ట్రాల్ కవితా వస్తువులయాయి. ఆమె కవిత్వం డొంకతిరుగుడు లేకుండా సూటిగా స్పష్టంగా తేలికయిన పదాలతో ఉంటుంది. వారి ప్రకృతి ప్రేమకు మచ్చు తునకగా ఈ వాక్యాల్ని అనేకులు పేర్కొంటారు- "భూమిని తూట్లు పొడవొద్దు/తీయటి పండు పిండొద్దు/దానిమీద ప్రేమతో/ఒంగి వాసనచూసి నోటికందించు".

యుద్ధానికి ముందు తరువాత, అనేక అమెరికా విశ్వవిద్యాలయాలతో మిస్ట్రాల్ సహచర్యం పెంచుకున్నారు. అనారోగ్యం కారణంగా చివరకు న్యూయార్క్ లోని ఇంటికే పరిమితం కాకతప్పలేదు. చివరి పదేళ్ల చిలీలోని తన వ్యావసాయిక బాల్య స్మృతులతో 'చిలీ కవితలు' సంకలనం మీద పనిచేసారు. భౌతిక మాతృత్వం కోసం ఆమె పడే తపనే బహుశా వారి ఊయలపాటలు, తల్లుల కోసం కవితలూనూ.

1957లో న్యూయార్క్ ఆసుపత్రిలో మరణించారు. చనిపోయిన నాటికి మిస్ట్రాల్ వయస్సు 67. ఆమె అంతిమ సంస్కారం సెయింట్ పాట్రిక్ కెథీడ్రల్‌లో జరిగాయి. 23 మార్చ్ 1960లో వారి అవశేషాల్ని చిలీకి తరలించారు.

మిస్ట్రాల్ పేరుమీద 2000 నుండి ప్రముఖ కవికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. మిస్ట్రాల్‌ను గుర్తుంచేసుకునే వారు, వారి ఈ వాక్యాల్ని మరువలేరు. "మనం చాలా తప్పులు చేస్తున్న దోషులం. దానిలో ఘోరమైన నేరం జీవితానికి ఊటలాంటి బాల్యాన్ని నిర్లక్ష్యం చేయటం. మనకు కావల్సినవి చాలా వరకు మనం పక్కన పెట్టొచ్చు . బాల్యం కాదు. అప్పుడే అతని ఎముకలు రూపుదిద్దుకుంటాయి, రక్తం తయారవుతుంది. తెలివి అభివృద్ధి చెందుతుంది. అతనికి 'రేపు' అని చెప్పలేము, అతని పేరు 'నేడు'.

మిస్ట్రాల్ విషాదాంత జీవితమే ఆమె కవిత్వానికి ఇంధనం. మరణానికి దారితీసే ఒక నిగూఢ తీర్థయాత్ర జీవితం, ప్రపంచం నుండి ఒక తుది విముక్తి మరణం-అని ఆమె కవితలు చెబుతాయి. కానీ కవి కూడా తన సమయానికి ఒక మాధ్యమం. "శరీరానికి ఆత్మ ఎలాగో, తన ప్రజలకు కళాకారుడు అలానే" అని ఒకప్పుడు ఆమె అన్న ఈ మాటల్నే ఆమె సమాధి మీద కూడా రాయించారు.

వ్యక్తిగతంగా ఎన్ని ఇబ్బందులు పడ్డా చదవడం ద్వారా, కవిత్వం రచించడం ద్వారా నిరాశా నిస్పృహలకు లోను కాకుండా తనని తాను కాపాడుకున్నారామె. ఒకవిధంగా కవిత్వమే ఆమకు ఆలంబనయింది.

లాంగ్స్టన్ హ్యూజెస్, ఆమె సహచరి కార్యదర్శి డోరిస్ డానా, ఉర్సులా, పాల్ బర్న్స్ మొదలైనవారు మిస్ట్రాల్ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించిన వారిలో ప్రముఖులు,

చిలీ మీద, లాటిన్ అమెరికా మీద కూడా మిస్ట్రాల్ కవిత్వం రాసింది. ఉత్తర అమెరికా ప్రాబల్యానికి విరుద్ధంగా చిలీ సాంస్కృతిక గుర్తింపును కాపాడుకునేందుకు జరిగిన శాండినిస్టా గెరిల్లా ఉద్యమానికి, దేశీయ మూలాల్ని పునరుద్ఘాటిస్తూ వెన్నుదన్నుగా నిలిచింది. కవిత్వం రాయడంలో ఆమె చూపిన శ్రద్ధ విశేషమైంది. ఒక్కొక్క కవితను అనేకసార్లు సరి చూసుకుంటూ, పరిపూర్ణత చేకూరేవరకు తిరగరాసేవారు. తనకు పూర్తి సంతృప్తినిచ్చాకనే ప్రచురణకు పంపేవారు. ఈవిధంగా ఆమె ప్రతి కవిత కూడా ఒక సాధనలోంచి వచ్చిన కళాఖండం. ఈ కారణంగానే ఆమె జీవితకాలంలో 379 కవితలు మాత్రమే ప్రచురించగలిగారు. అయితే మరో 400 కవితల వరకూ ప్రచురణకు ఆమె పనికిరావు అనుకున్నవి, ఆమె మరణాంతరం కనుగొన్నారు.

- ముకుంద రామారావు, 9908347273

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

ఆ సైట్లను ఆపడమెలా?

'కొంతమంది యువకులు ముందుతరం దూతలు... పావన నవజీవన బృందావన నిర్మాతలు..' అంటాడు శ్రీశ్రీ. ముందుతరం నిర్మాతలుగా వుండాల్సిన యువతరం పెడదోవ పడుతున్నారు. ఇంటర్'నెట్'లో చిక్కుకొని బయటపడలేక తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరగడం, నెట్ సదుపాయం అందుబాటులోకి రావడం కూడా యువత పెడతోవ పట్టడానికి కారణమవుతోంది. యువత అశ్లీల చిత్రాలు చూడటానికి ఎక్కువగా ఉత్సాహం చూపిస్తున్నట్లుగా తాజా సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ ఫోన్లు చౌకగా దొరకటం, నెట్ అందుబాటులో ఉండటంతో ఇటీవల ఈ అశ్లీల సైట్స్‌ను చూసే వారి సంఖ్య పెరిగిపోయింది. యువత ఈ సైట్లకు బానిసలవుతున్నట్టు తాజా నివేదికల వల్ల తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు 85వేల అశ్లీల వీడియోలు చూస్తున్నట్టుగా ఆ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మన దేశంలో నాలుగు కోట్లకుపైగా బూతు సైట్లు వున్నాయని, వీటిని నియంత్రించడం సాధ్యం కావడం లేదని, ఒకదాన్ని బ్లాక్ చేస్తుంటే అలాంటివే మరికొన్ని పుట్టుకొస్తున్నాయని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు మొరపెట్టుకుంది.

ఈ క్రమంలో అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలనే ఉద్యమం క్రమంగా ఊపందుకుంటోంది. అశ్లీల దృశ్యాలను అందిస్తున్న వెబ్‌సైట్ల నుండి ఆ 'కంటెంట్'ను తొలగించడంతో పాటు, అలాంటి వెబ్‌సైట్లను నిర్వహిస్తున్న వ్యక్తులు లేదా సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. ఇది కొంత కష్టసాధ్యమైన వ్యవహారమే. లక్షలాది వెబ్‌సైట్లు కోట్లాదిగా వున్న అశ్లీల సాహిత్యం, వీడియోలను నెట్‌లో అందుబాటులో ఉంచాయి. ఈ వెబ్‌సైట్ల కారణంగానే లైంగిక నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని పోలీసులు సైతం హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో లండన్‌కు చెందిన 'రెస్క్యూ' సంస్థ అశ్లీల వెబ్‌సైట్లకు సంబంధించి యువత మనసులో ఎలాంటి ఆలోచనలున్నాయో తెలుసుకునేందుకు హైదరాబాద్‌తో పాటు పలు నగరాల్లో ఇటీవల ఒక సర్వే నిర్వహించింది. దక్షిణ భారతదేశంలో దాదాపు 40 వేల మంది యువతీ యువకులను తాము అధ్యయనం చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. అశ్లీల వెబ్‌సైట్లను చూసేందుకు అలవాటు పడ్డవారిలో క్రమంగా హింసాత్మక ప్రవృత్తి పెచ్చుమీరుతోంది. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు కారణమవుతోంది. 20శాతం మంది కళాశాల విద్యార్థులు అశ్లీల చిత్రాలు చూస్తూ వాటికి బానిసలవుతున్నారని సర్వేలో వెల్లడైంది. ఈ వెబ్‌సైట్లను సగటున వారానికి నాలుగు గంటల చొప్పున చూస్తుండడంతో వారు చదువుపై దృష్టి సారించలేక చెడు మార్గం వైపు మళ్లుతున్నారు. దాదాపు 56 శాతం మంది విద్యార్థులు అశ్లీల చిత్రాల్లో వలే తామూ నిజజీవితంలో చేయాలని భావిస్తున్నట్లు చెప్పడం గమనార్హం. కాగా, అశ్లీల వెబ్‌సైట్లను అడ్డుకోవడం కష్టమేమీ కాదని 'రెస్క్యూ' సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇలాంటి వెబ్‌సైట్లు ఇంట్లో పిల్లలు చూడకుండా 'సైబర్ సెక్యూరిటీ' ఏర్పాటు చేసుకోవచ్చని వారు సూచిస్తున్నారు. చైనా, సౌదీ అరేబియా వంటి దేశాల్లో ఇప్పటికే వీటిని పూర్తిగా నివారించగలిగారు. మన దేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న ఐటి చట్టం ప్రకారం అశ్లీల వెబ్‌సైట్లను పూర్తి స్థాయిలో అడ్డుకోవచ్చని వారు చెబుతున్నారు.

ఈ అశ్లీల సైట్ల నియంత్రణకు కొన్ని దేశాలు, రాష్ట్రాలు ఒకవైపు చర్యలు తీసుకుంటుంటే... మరోవైపు అశ్లీల కంటెంట్‌ను వెతికి తెచ్చేందుకు మరో కొత్త సెర్చింజన్ వచ్చిందంటే నమ్మకతప్పదు. ఇంటర్నెట్‌లో రోజుకో కొత్త సెర్చింజన్ రావడం కొత్తేమీ కాదు. కానీ.. ఈ సెర్చింజన్‌ను బూతు సైట్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. దీన్ని డెవలప్ చేసింది కూడా గూగుల్ మాజీ ఉద్యోగులే. తమ సెర్చింజన్ రాకెట్‌లా దూసుకొచ్చిందని, సెప్టెంబర్ 15వ తేదీన అది ప్రారంభమైందని దాని వ్యవస్థాపకులలో ఒకరైన కోలిన్ రౌన్‌ట్రీ వెల్లడించారు. ప్రస్తుతం వున్న పరిస్థితుల నేపథ్యంలో గూగుల్, బింగ్ సైట్లు అడల్ట్ కంటెంట్‌ను క్రమంగా తమ సెర్చింజన్ల నుంచి తీసేస్తున్నాయని, అందుకే ఇప్పుడు కొత్తగా దానికోసం ఒక సెర్చింజన్ ఉండాల్సిన అవసరం ఏర్పడిందని వారు చెబుతున్నారు. గూగుల్‌లో ఎవరైనా వీటికోసం వెతికితే కనపడకపోగా.. హెచ్చరికలు ఉంటాయని, అలాంటివాళ్లు వెంటనే తమ సెర్చింజన్ చూస్తే సరిపోతుందని రౌన్‌ట్రీ అంటున్నారు. ఇదే సమయంలో కుకీస్ గానీ, ఇతర యూజర్ ట్రాకింగ్ టెక్నాలజీలను గానీ తాము ఉపయోగించట్లేదని, వినియోగదార్ల వ్యక్తిగత రహస్యాలను కూడా కాపాడేలా తమ సెర్చింజన్ ఉంటుందని వారు చెబుతున్నారు. సాధారణంగా ఇటువంటి సైట్లకు సంబంధించిన సర్వర్లన్నీ విదేశాల్లోనే వుంటాయి. ఆయా దేశాలచట్టాలు వాటికి అనుకూలంగా వుంటాయి. ఈ క్రమంలో వాటిని నిషేధించడం అసాధ్యం. కాకపోతే వాటి నియంత్రణకు చైనా మాదిరిగా చట్టం, సాంకేతిక పరిజ్ఞానం కలిసి పనిచేయాలి. అప్పుడే కొంతవరకైనా వీటిని నియంత్రించవచ్చు.

అశ్లీలసైట్‌లను బ్లాక్ చేయటం : ప్రస్తుతం పిల్లల నుంచి పెద్దల వరకు కంప్యూటర్ వినియోగిస్తున్నారు. చాలా కుటుంబాల్లో పెద్దల పర్యవేక్షణ లేకండానే పిల్లలు ఇంటర్నెట్‌ను బ్రౌజ్ చేస్తున్నారు!. గేమ్స్, చాటింగ్ ఇలా రకరకాల ఆన్‌లైన్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రోజురోజుకు పెరుగుతోన్న ఈ సంస్కృతిని ప్రమాదకర చర్యగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. పిల్లలు ఇంటర్నెట్‌లో బ్రౌజింగ్ చేస్తున్నప్పుడు ఈ అశ్లీల వెబ్‌సైట్లు, సందేశాలు, ఫోటోలు, వీడియోలను వాళ్లకు కనిపించకుండా ఉంచేందుకు కొన్ని సాఫ్ట్‌వేర్స్‌తో పాటు మనం వాడే కంప్యూటర్‌లోనూ కొన్ని మార్గాలు అందుబాటులోకి ఉన్నాయి. కంట్రోల్ ప్యానల్‌లోని Network and Internet సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకోవడం ద్వారా నియంత్రణ విధించవచ్చు. విండోస్ 7 లేదా విండోస్ 8 కంప్యూటర్‌లో ఈ అవకాశం వుంది.

– ముందుగా మీ కంప్యూటర్‌లోని అడ్మిన్‌స్ట్రేటర్ అకౌంట్‌లోకి లాగిన్ అయ్యి control panel ను ఓపెన్ చేసి Network and Internet పై క్లిక్ చేయాలి.

– దానిలోని Internet Options పై క్లిక్ చేస్తే, అప్పుడు Internet properties విండో స్క్రీన్‌పై ఓపెన్ అవుతుంది.

– దానిలో content ట్యాబ్‌పై క్లిక్ చేస్తే "Family Safety" అనే ఆప్షన్ కనిపిస్తుంది. ఈ ఆప్షన్‌పై క్లిక్ చేయండి. ఇది అమలు కాబోయే చేసేందుకు పిల్లల అకౌంట్‌ను సెలక్ట్ చేసుకోండి.

– పిల్లల అకౌంట్‌ను సెలెక్ట్ చేసుకున్న తర్వాత "Family Safety" ఆప్షన్‌ను "On" లో వుంచి, ఆ తర్వాత "Web filtering" ఆప్షన్‌ను ఎంపింక చేసుకోవాలి.

– "Web filtering" ఆప్షన్‌లో "can only use the websites I allow" ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

– ఆ తర్వాత web Restrictions లోకి వెళ్లి "Designed for children" ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అంతే, ఇక ఆ కంప్యూటర్‌లోకి ఎలాంటి అశ్లీల సైట్లు వచ్చే అవకాశమే లేదు.

– రచయిత సెల్ : 9490099219

హెపటైటిస్-బి కి చెక్ పెట్టవచ్చు

ఏ వ్యాధినైనా డాక్టర్ దగ్గర ధైర్యంగా చెప్పుకుంటారు. కానీ, లైంగిక వ్యాధికి గురయితే మాత్రం బయటకు చెప్పుకోవడానికే నానా తంటాలు పడాల్సి వస్తుంది. అసలు లైంగిక వ్యాధులు అంటేనే ఒక భయం, ఎన్నో రకాల సమస్యలు, అవగాహన లోపం, తెలియని ఆతృత. ఏదో ఒక మందుతో దాన్ని తగ్గించుకోవాలనే ఆరాటం. వీటన్నిటి మధ్య నలిగిపోయేవారు ఎందరో! సరైన చికిత్స లేక ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అయితే, ఇటువంటి సమస్యలకు సత్వర పరిష్కారంతో, నమ్మకమైన చికిత్సతో మంచి ఫలితాలు సాధించవచ్చని, దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు ప్రముఖ హోమియో వైద్యులు మధు వారణాశి.

లైంగిక వ్యాధులలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి హెపటైటిస్ బి. ఒక సర్వే ప్రకారం, ప్రపంచంలో సుమారు 200కోట్ల మంది జనాభా హెపటైటిస్ బి బారిన పడినట్లుగా తెలుస్తోంది. వైరల్ సంబంధిత వ్యాధులలో హెపటైటిస్ బి ఒక మహమ్మారిగా మారే సూచనలున్నాయి. భారతదేశంలో 4కోట్ల మంది హెపటైటిస్ బితో బాధపడుతున్నారని అంచనా. ప్రతి సంవత్సరం లక్ష మందికి పైగా భారతీయులు హెపటైటిస్ బి మూలంగా మరణిస్తున్నారు. రక్తం, లాలాజలం, వీర్యం, యోని ద్రవం లాంటి పదార్థాలలో వైరస్ ఉంటుంది. అసురక్షితమైన లైంగిక సంపర్కం వల్ల ఇది సంక్రమిస్తుంది. తల్లుల నుంచి పిల్లలకు, శిశువు నుంచి శిశువుకు సంక్రమిస్తుంది. అవగాహన లోపంతో ఎంతోమంది దీని బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

హెపటైటిస్ బి అంటే? : మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన భాగం. ఎన్నో కార్యక్రమాలను కాలేయం నిర్వహిస్తుంది. అలాంటి కాలేయం దెబ్బతింటే ఎన్నో బాధలు, ఎన్నో విపత్తులు ఎదురవుతాయి. కొన్ని రకాల వైరస్ కారణంగా కాలేయానికి ఇన్ఫెక్షన్ వచ్చి హెపటైటిస్ వ్యాధి వస్తుంది. వీటిలో ప్రమాదకరమైనవి హెపటైటిస్ బి, హెపటైటిస్ సి. వీటిని హెపటోట్రోఫిక్ వైరస్ అని అంటారు. హెపటైటిస్ బి మొదట మామూలు లక్షణాలతో వచ్చి, అది దీర్ఘకాలికంగా మారి, కాలేయాన్ని మెల్లమెల్లగా నిర్వీర్యం చేస్తూ ప్రాణాంతకంగా మారుస్తుంది. లివర్ కేన్సర్, సిరోసిస్, వైరల్ హెపటైటిస్ వ్యాధులు రావటానికి మూలకారణం అవుతుంది. హెపటైటిస్ బి వల్ల కాలేయంలోని కణజాలం క్రమక్రమంగా పాడవుతుంది. రోగనిరోధక వ్యవస్థ తగ్గడం వల్ల కాలేయం నిర్వహించే విధులకు ఆటంకం ఏర్పడుతుంది. దీని వల్ల కాలేయంలో వాపు వచ్చి పలురకాల సమస్యలకు తోడ్పడుతుంది.



డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509

కారణాలు

★ స్టెరిలైజ్ చేయని సిరంజీలు, లైంగిక సంపర్కం ద్వారా,

★ హెపటైటిస్ బి ఉన్న వ్యక్తి నుంచి నేత్రాలు, మూత్రపిండాలు, రక్తం తీసుకోవడం వల్ల,

★ హెపటైటిస్ బి సోకిన వారి రక్తం, గాయాల ద్వారా, ఏ కారణం చేతనైనా వీరి రక్తం వేరేవాళ్లకు తాకడం ద్వారా,

★ పచ్చబొట్లు, ఒకే బ్లేడ్, ఒకే సిరంజి ఎక్కువ మంది వాడినప్పుడు. కలుషితమైన ఆహారం,

★ బ్యాక్టీరియా, అమీబా వంటి పరాన్నజీవుల వల్ల హెపటైటిస్ బి వ్యాపిస్తుంది. ఎయిడ్స్ కన్నా ప్రమాదకరమైన వ్యాధిగా గుర్తించవచ్చు.

లక్షణాలు : సాధారణంగా ఈ వ్యాధి లక్షణాలు బయటికి కనిపించకుండా నిశ్శబ్దంగా ఉంటాయి. హెపటైటిస్ బి వైరస్ ఎన్నో సంవత్సరాలు శరీరంలో ఉంటుంది. శరీరం వెలుపల సాధారణ ఉష్ణోగ్రత వద్ద వారం రోజులు మాత్రమే సజీవంగా ఉండగలదు. కొంతమందిలో ఈ వైరస్ ప్రవేశించిన కొద్ది రోజులకే కామెర్లు వస్తాయి. దీనిని అక్యూట్ స్టేజ్‌గా చెప్పవచ్చు. ఈ దశలో దానంతటదే తగ్గుతుంది. కొంతమందిలో ఈ వైరస్ తొలగిపోకుండా, శాశ్వతంగా శరీరంలో ఉంటూ బలం పెంచుకుంటూ పోతుంది. దీనిని క్రానిక్ స్టేజ్ అంటారు. ఇదే అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. హెపటైటిస్ బి కారణంగా కాలేయం వ్యాధిగ్రస్తమై భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. కాళ్ల వాపు, పొట్ట ఉబ్బరం, వాంతులు లక్షణాలు కనపడతాయి.

ఎలా నివారించాలి? :విచ్చలవిడి శృంగారానికి దూరంగా ఉండాలి. అపరిచితులతో శృంగార జీవితంలో సురక్షితమైన పద్ధతులు అవలంబించాలి. డిస్పోజబుల్ సూదులు, సిరంజీలు వాడాలి. ఒకరు వాడిన షేవింగ్ రేజర్లు, బ్లేడ్లను వాడరాదు. రక్తం తీసుకోవలసి వస్తే హెపటైటిస్ బి పరీక్ష చేసి రక్తం ఎక్కించుకోవాలి.

వ్యాధి నిర్ధారణ : హెచ్‌బిఎస్ ఎజి అనే రక్తపరీక్ష, లివర్ ఫంక్షన్ టెస్ట్, సిబిపి, లివర్ బయాప్సి, వైరల్ లోడ్ ద్వారా రోగ తీవ్రతను గుర్తించవచ్చు.

హోమియో చికిత్స : సహజసూత్రాలపైన ఆధారపడిన హోమియో వైద్యం వ్యాధిని పూర్తిగా నిర్మూలించగల సత్తా కలిగినది. హోమియోపతి రోగనిరోధక శక్తిని పెంచి ఇమ్యునో మాడ్యులేటర్స్‌గా పనిచేస్తుంది. అందువల్ల మూలకారణాన్ని గుర్తించి చికిత్స చేస్తే ఎలాంటి సమస్య అయినా తగ్గుతుంది. హెపటైటిస్ బి లాంటి కేసులలో ఆధునిక హోమియో చికిత్సతో రోగిలోని రోగనిరోధక శక్తిని పెంచి దుష్ఫలితాలు లేకుండా వ్యాధిని నివారించవచ్చు. అనుభవజ్ఞులైన హోమియో వైద్యుని పర్యవేక్షణలో చికిత్స చేయించుకుంటే హెపటైటిస్ బి లేదా హెపటైటిస్ సి వ్యాధులను నయం చేయవచ్చు.

*

స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు



స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర
రచన: మాకినేని బసవపున్నయ్య,
అనువాదం: ఎ.కె.ఆర్.బి. కోటేశ్వరరావు
పేజీలు: 112, వెల: రూ. 60
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర గురించి నాటి నుంచి నేటివరకు చర్చలు జరుగుతూనే వున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలు వింటున్నాం. “కమ్యూనిస్టులు బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో షరీకయ్యారా? లేక కాంగ్రెస్, ముస్లింలీగ్ నాయకులే భారత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ద్రోహం చేశారా? అన్నది స్పష్టంగా తెలియాలంటే 1942 ఆగస్టు – 1947 ఆగస్టు మధ్య జరిగిన పరిణామాలను అధ్యయనం చేయటం అవసరం” అంటారు మాకినేని బసవపున్నయ్య గారు. ఈ క్రమాన కమ్యూనిస్టులపై జరిగిన తప్పుడు ప్రచారం గురించి వివరించారు. రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి పరిస్థితుల్ని విశ్లేషించారు. ఇందుకోసమే ‘స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర’ శీర్షికన ఒక పుస్తకం రాశారు. ఆనాడు దేశంలోని వివిధ కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై కమ్యూనిస్టు పార్టీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోకముందే ఎలాంటి వ్యతిరేకత వ్యక్తమైందో వివరించారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమకాలంలో కాంగ్రెస్‌పార్టీ తన కర్తవ్యాల్ని విస్మరించి, బ్రిటిష్‌వారితో శాంతియుత సహజీవనం పేరిట కుమ్మక్కయిన తీరును బసవపున్నయ్య గారు చర్చించారు. స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల వైఖరి, అనుసరించిన విధానం, వాటి సంబద్ధతను అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం చదవాలి. కమ్యూనిస్టు ఉద్యమ ప్రాబల్యం వల్లనే బ్రిటిష్ వారికి అధికార బదిలీ తప్పలేదన్న వాస్తవాన్ని సోదహరణంగా నిరూపించిన గ్రంథమిది. ఎం.బి. శతజయంతి సందర్భంగా ఈ పుస్తకాన్ని వెలువరించారు. సోషలిజం పట్ల ఎంబిలో వుండే ఆత్మవిశ్వాసాన్ని గుర్తు చేస్తూ ఈ పుస్తకానికి సీతారాం ఏచూరి రాసిన ముందుమాట కమ్యూనిస్టు ఉద్యమ అభిమానులకు బలాన్నిస్తుంది.

గమనిక

➽ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➽ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➽ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–500030.

కల్లోల జీవితాల చిత్రణ



పోరు (కథల సంపుటి)
రచన: కె.వి.నరేందర్
పేజీలు: 112, వెల: రూ. 100
ప్రతులకు: కె.వి.శ్రీదేవి, 7-4-264బి,
బైపాస్‌రోడ్డు దగ్గర
విద్యానగర్, జగిత్యాల-505 327,
ఫోను: 94404 02871

తెలంగాణ జీవితం, ఉద్యమం మీద చాలా కాలంగా కె.వి.నరేందర్ కథలు రాస్తున్నారు. ఆయన తాజా కథల సంకలనం ‘పోరు’ ఈమధ్యన వెలువడింది. దీనిలో పది కథలున్నాయి. ఉద్యమాలతో కల్లోలమైన జీవితాలకు సంబంధించిన కథలు దీనిలో ఉన్నాయి. ఈ కథలతోపాటు నరేందర్ రాసిన కాన్సెప్ట్ కథల మీద నర్సిం, రామాచంద్రమౌళి, కాసుల ప్రతాపరెడ్డి, దాట్ల దేవదానంరాజు, ఎం.నారాయణశర్మ, విహారి మొదలయిన వారు చేసిన సమీక్షలు పుస్తకం చివరలో చేర్చారు. తెలంగాణ జీవితంలోని కల్లోల్లాన్ని చాలా వాస్తవికంగా చర్చించారు నరేందర్. ఆయా సంఘటనలు హృదయం ద్రవించేలా దృశ్యమానం చేశారు. ఏకాంశ కథలు రాయడంలో ఈ రచయిత పరిణతి సాధించారు. ఇప్పటివరకు 8 ఏకాంశ కథా సంపుటాలు తీసుకువచ్చారు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన సంగెవేని రవీంద్ర చెప్పినట్టు తెలుగు కథా సాహిత్యంలో ఇది ఎవరూ చేయని ప్రయోగం. ఒకవేళ చేద్దామనుకున్నా, ఇప్పుడు నరేందర్‌ని అధిగమించడం కూడా కష్టమే. కథారచనలో నరేందర్ చూపిన నిబద్ధత మెచ్చదగింది. చదివించే గుణంతో సమాజంలోని కల్లోల్లాన్ని ఈ కథల్లో నరేందర్ ఆవిష్కరించారు.

సమస్యలపై సదవగాహన



తొలి కిరణాలు
రచన: పొత్తూరి సుబ్బారావు
పేజీలు: 178, వెల: రూ. 120
ప్రతులకు: సాహితీ కిరణం, 11-13,
154, అలకాపురి రోడ్డు నెం: 3,
హైదరాబాద్-35,
ఫోను: 94907 51681

వర్తమాన సమాజ గమనంలోని అనేక అంశాలపై పొత్తూరి సుబ్బారావు రాసిన సంపాదకీయాల సమాహారం ‘తొలి కిరణాలు’ పుస్తకం. ‘సాహితీ కిరణం’ కోసం రాసిన సంపాదకీయాల్లో ఇవాళ సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని చర్చించారు. పాఠకుల్లో సదవగాహన కల్పించడానికి ప్రయత్నించారు. సామాజిక సంక్షోభాల మీదనే కాకుండా సాహితీ సాంస్కృతిక అంశాల మీద కూడా వున్న సంపాదకీయాలివి. వందేళ్ళ సినిమాపైన, ప్లాస్టిక్‌పై యుద్ధం మీద, త్రిభాష సూత్రం గురించి రాసిన సంపాదకీయాలు పాఠకుల అవగాహనని విస్తృతం చేస్తాయి. నాలుగు కాలాలపాటు నిలిచే రచనలుగా వీటిని పరిగణించవచ్చు. అందుకే పుస్తకరూపం ఇవ్వడం ముదావహం.

కాలానికీ కవిత్వానికీ మధ్య ఒక పూల సంతకం

కాలం ఏ కాలపు ఉద్వేగ వాయువుల్నయినా శ్వాసగా తీసుకుంటుంది. బహుశః ఆకాలంలో జీవించే సృజనకారులు కూడా. బయటకి తాను తీసుకున్న సందర్భాన్ని ఏ భావనలో లోకానికి సమర్పిస్తున్నారనేదే కవిత్వంలో కనిపించే ప్రధాన వాహిక. 'కలనేత' వంటి దళిత వచనాన్ని చదివిన వాళ్ళెవరికైనా ప్రసాదమూర్తి దృష్టి, సందర్భాన్ని ఏ గొలుసులనుండి బందీ కాకుండా వ్యక్తం చేసే తీరు గుర్తుంటుంది. ఒక కాలంలో జీవించే కవి సృజనలో ఆయాకాలాల సాంస్కృతికత లుంటాయి. అనేక మందిలో కేవలం ఉద్వేగ స్థానాల వైపు నిలబడటం కనిపిస్తుంది. ప్రసాదమూర్తి సమతుల్యమైన మానవీయ భావన నుంచి స్వచ్ఛమైన గంగనీరులా నిలుస్తారు.

కొత్త కవిత్వం 'పూలండోయ్ పూలు' లో ఒక కాలిక ముద్ర ఉన్న కవితలు. శాశ్వత ముద్ర, ఉన్న కవితలు రెండూ ఉన్నాయి. కొన్నిటికి ప్రత్యేక సందర్భాలుండటం, లేకపోవడమే ఈ వైవిద్యానికి కారణం. శాంతరసం తాత్విక ధారకు మూలమంటారు. ప్రాచీనులు. ఈ శాంత చిత్తం నుంచే, ఒకనొక కారుణీక వచనంతో తనదైన మానవీయ తాత్త్విక స్పృహను ప్రసారం చేస్తారు ప్రసాదమూర్తి.

సమరాంగన వాడి (96పే.) ఇక ప్రేమించుకుందాం (50పే.) ఎగ్రేట్ డెమొక్రసీ (109పే.) యాదికొస్తున్నారు. (45పే.) సాక్ష్యం (41పే.) పునరామోసం (34పే.) పాలస్తీనా ట్రిప్ (26పే.) మొదలైనవన్నీ ఒకానొక బలమైన 'కాలిక స్పృహ' గల కవితలు. ఏ స్థితినుంచి రాసినా కవిత్వానికి ప్రపంచానికి మధ్య ఒక సమన్వయ స్థితి సాధించడం కనిపిస్తుంది.

తన చుట్టూ ఉన్న మిత్రులు, తానభిమానించే. వాగు, అమ్మ, చెల్లి, కూతురు ఇలాంటి వాళ్లంతా ఈ కవితల్లో కనిపిస్తారు. ప్రకృతికి, జీవితానికి సమస్వయాన్ని సాధించిన కవితలూ ఉన్నాయి.

ఎన్ని కవితలు రాసినా ప్రతికవిలో కొన్ని కవితా ముద్ర లుంటాయి. 'దీపశిఖ' కాళిదాసు, 'ఆతపత్ర,' భారవి ఇలాంటివే, 'పూలండోయ్ పూలు' సంపుటిని గమనిస్తే 'పూలు' ఒక కవితా ముద్రలా కనిపిస్తాయి. దానికి కారణం 'పూలు, కొమ్మ, రెమ్మ, చెట్టు, వంటి అర్ధ క్షేత్రానికి సంబంధించిన పదాలు అనేక కవితల్లో కనిపించడం.

"ఏదో కొమ్మకు వేలాడుతూ (అక్కడే ఉండిపోదామనుకున్నాను) ప్రతి చెట్టుకూ నో వేకిన్సీ బోర్డు" – (పే.119),

"చెట్టు పిలుస్తున్నా వినకుండా రోడ్డు పై కొచ్చి" –(11పే.),

" పువ్వులు భయంతో వణికిపోయాయి/ అవి మన భారత పౌరులు కదా"– (109పే.)

"మొలకలేవో తలలూపుతున్న దృశ్యాలు" –(103పే.),

"శాంతి జిహాదీ పువ్వుల పవిత్ర యుద్ధాన్ని నడిపిద్దాం" – (89పే.),

"వాళ్ల తరాల మట్టి తవ్వి/ మన ముందుపరిచి మొక్కలై మొలుస్తారు/ మనం ఆ మొక్కకు పువ్వులై వేలాడతాం" –(87పే.),

"కత్తుల భాష మాత్రమే తెలిసిన మనుషులకు / ఈ చెట్టుతో పూలగుత్తుల సంభాషణ నేర్పించాలి"–(80పే.),

"రోజు కొత్త రేకులతో ముస్తాబవుతాం" – (39పే.)

ఇలాంటి వాక్యాలు ఈ సంపుటిలో, ప్రసాదమూర్తిగారి కవితా హృదయం నిండా కనిపిస్తాయి. అసలు "దేవ పుష్పం, పూలండోయ్ పూలు" శీర్షికలే అందుకు ప్రధాన ఉదాహరణ. ' పురా ప్రియురాలు (79పే.) ఒక గొప్ప సౌందర్యాను భూతితో మళ్ళీ, మళ్ళీ చదివించే కవిత, కవితాను కొత్తమార్గం తొక్కించిన శైలి అనేక చోట్ల తారసపడుతుంది. ఒక ప్రశాంత సమీకారణాన్ని ఆయన కవిత్వం తయారు చేస్తుంది. తానే కవిత్వంలో చెప్పుకున్నట్టు ప్రసాదమూర్తి "లోక కళాణ్యం కోసం పూజ చేసే స్వప్నసంచారి".

- ఎం.నారాయణశర్మ

సాహిత్య సంచలనం 'జముకు'



జముకు (తొమ్మిది బులెటిన్ల సంకలనం)
ప్రచురణ: శ్రీకాకుళ సాహితి
పేజీలు: 212, వెల: రూ. 100
ప్రతులకు: బి.వి.ఎ.రామారావునాయుడు
హరిత, శ్రీవిశాఖ 'ఏ' కాలనీ, శ్రీకాకుళం
ఫోను: 94410 95961

దాదాపు పాతికేళ్ళ కిందట శ్రీకాకుళం నుంచి వచ్చిన 'జముకు' బులెటిన్‌కు ప్రత్యేక ప్రాధాన్యముంది. సాహిత్యచరిత్రలో దానికి ఒక విశిష్టస్థానం వుంది. అప్పట్లో 'జముకు' సంచికలు తొమ్మిది వచ్చాయి. ఇప్పుడు వాటన్నిటిని కలిపి 'జముకు తొమ్మిది బులెటిన్ల సంకలనం' శీర్షికన శ్రీకాకుళ సాహితి ప్రచురించింది. ఆనాటి సామాజిక కల్లోలాల్ని, ప్రజల జీవితాల్ని రచయితలు ఏవిధంగా చిత్రించారో ఈ సంచికల్లో చూస్తాం. ఒక్కొక్క బులెటిన్ ప్రత్యేక సాహిత్య సంచికల్లా వెలువరించారు. తెలుగు సాహిత్యచరిత్రలో 'జముకు' సంచికలకి ప్రాధాన్యముంది. అలనాటి సాహిత్య సంచలనాలను రికార్డు చేయడానికి ఈ పుస్తకం ఉపకరిస్తుంది.

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్–500030.

■ ఈ వారం కవిత్వం

గురిచూసే పద్యం కోసం

అంతా ఆత్రంగా ఆబగా నిస్సంకోచంగా ఒక్కో పటాన్ని మింగేస్తూ దారి పొడుగునా
నెత్తుటిముద్దలను విసురుకుంటూ వాడు ఉరుకురికి వస్తున్నాడు

సరిగ్గా ఇప్పుడే నువ్వో గురి చూసే పద్యం రాయాలి

ఓ చాపలా చుట్టి చంకనెత్తుకు పోవాలని నీ కాలి కింద నేలను మడిచిపెట్టి పోవాలని
నీకంటూ కప్పెట్టే మట్టి దొరకకుండా పోవాలని వాడు పరుగు పరుగున వస్తున్నాడు

నువ్విప్పుడే సరిగ్గా గురి చూసి పద్యం రాయాలి.

నీ చేతిలోని చీపురు వాడు లాక్కుని పచ్చని ఆకులను చిమ్ముతూ
వాడికో పవిత్రతను ఆపాదిస్తూ ఉక్కు కవచకుండలాల బోర విరుస్తూ వస్తున్నాడు

నువ్వే ఇప్పుడు ఓ గురి చూసి పద్యం రాయాలి

తానే సర్వం సహజం సమూలం అని ప్రకటిస్తూ నీ మూలాలను
పీల్చి పిప్పి చేసే సరంజామాతో ప్రొక్లెయినర్‌లా పొడుచుకు వస్తున్నాడు
రాయాలి నువ్విప్పుడే ఓ గురి చూసి పద్యం

స్మార్ట్‌గా నీ చుట్టూ కాంక్రీట్ సమాధులను నిర్మించి నీ ఊపిరి తీసి
మేక్ ఇన్ ఇండియాతో నీ కంట్లో మేకులు గుచ్చి సర్వం హరించేందుకు వస్తున్నాడు

నువ్వు రాయాలిప్పుడు గురి చూసి ఓ పద్యం.

- కెక్యూబ్ వర్మ, 94934 36277

శ్రమ సంగీతమై...

రెప్పలు వాల్చి
పుట్టు గుడ్డిలా
అభినయించటం కాదు
ఆకుపచ్చ లోయలోంచి
గగనపు వీధిలోకి చూడు
చూపుని శుభ్రం చేసుకుని -

బతుకు ఉరికొయ్యపై
వేలాడుతున్న ఆకలి నేరగాళ్ళు
చరిత్ర నెగడుపై
పచ్చి పాదాలతో
ప్రవహిస్తున్నారు -

దు:ఖనిధులను మోసుకుంటూ
ఊపిరి తాళ్ళు బిగించుకుని
పసిమొగ్గల్ని పేగుల్లో పెట్టుకుని
ప్రాణసూత్రమెరిగి ప్రవహిస్తూ
బ్రతుకీడుస్తున్న
సుఖమెరుగని జీవితాల్ని చూడు...

చెమట విత్తనం వికసించి
కాంతి వలయాలుగా మారి
భారమైన బతుకు పాటలు
ప్రాణ తరంగాలుగా
మొలకెత్తటం చూస్తావు
శ్రమ సంగీతమెరిగిన వాడివైతే!?

- కె.విల్సన్‌రావు, 89854 35515

టూత్‌'పిక్స్'

చూడ్డానికి చెక్కతో చేసినట్టున్న రాజమందిరాలు, లైట్ హౌస్, ట్రీహౌస్, ఫ్లవర్ వాజ్, కొండలు, బండలు, రాళ్లు ఇవన్నీ టూత్‌పిక్స్‌తో చేశారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఆసక్తి, సృజనాత్మకత ఉండాలే కానీ ఎన్నో రకాల కళాత్మకాలు తయారు చేసుకోవచ్చు.



రెప్పపాటులో

అనుకోకుండా ఒక్కోసారి మన చూపు ఏదో ఒక దగ్గర ఆగిపోతుంది. అబ్బురపరిచే దృశ్యం కనిపిస్తుంది. వెంటనే ఆ దృశ్యాన్ని కెమెరాలో బంధించేయాలనిపిస్తుంది. ఒక్క క్షణం ఆలస్యం చేశామా మరుక్షణమే మాయమైపోతుంది. అలాంటి అద్భుత దృశ్యాలే ఇవి.